

ఉగాది సందర్భంగా ఒంగోలులోని లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

పాత సింగరాయకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు





ఒంగోలులో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పంచాంగ శ్రవణం చేస్తున్న మఠంపల్లి దక్షిణామూర్తి, పక్కన మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు బీఎన్, ఉగ్ర, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు



ఒంగోలులో నిర్వహించిన ఉగాది వేడుకల్లో నాట్యం చేస్తున్న యువతి

వైభవంగా ఉగాది

ఊరూరా పంచాంగ శ్రవణాలు

తెలుగు సంవత్సరాది ఉగాదిని జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. వేకువజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఊరూరా పంచాంగ శ్రవణాలు జరిగాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి రాశి ఫలాల గురించి ఆసక్తిగా విన్నారు. ఒంగోలులో ప్రభుత్వ యంత్రాంగం నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఉగాది సందర్భంగా కొండపి మండలం జాళ్లపాలెంలోని వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల ఘనంగా జరిగింది. ఐదు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. వాటిపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



గుండంచర్ల వద్ద కాటంరాజు పల్లకి మోస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని, టీడీపీ వై.పాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు తదితరులు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- 'విశ్వావసు'లో సర్వతోముఖాభివృద్ధి
- మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి నాంది పలకాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఆకాంక్షించారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా వేదపండితులు మఠంపల్లి దక్షిణామూర్తి పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ ఈ విశ్వావసులో అధిపతి రాజుగా సూర్యుడు ఉండటం, అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా, వర్షాలు సమృద్ధిగా సకాలంలో కురిసేలా ఉండటం సంతోషకరమన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఈ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరికీ సుఖసంతోషాలతో మేలు జరగాలని ఆకాంక్షించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ ఈ సంవత్సరం సంతోషంగా జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాత, మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ విజయ కుమార్, ఏపీ పర్యాటక సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, డీఆర్వో చినఓబులేషు, ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధనరెడ్డి, వివిధ శాఖల అధికారులు చిరంజీవి, కిరణ్‌కుమార్, అర్జున్‌నాయక్, వెంకటనాయుడు, లక్ష్మానాయక్, జనార్దన్‌రెడ్డి, హేనసుజన, సుశీల, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాళ్లపాలెం, కాటంరాజు తిరునాళ్ల

5



తిరునాళ్ల సందర్భంగా జాళ్లపాలెంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భారీగా వచ్చిన భక్తులు

పారదర్శకంగా భూముల రీసర్వే

- ప్రతి మండలంలో రెండు గ్రామాలు ఎంపిక
- గ్రామసభలు, ర్యాలీలు నిర్వహించాలని జేసీ ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన దానికి భిన్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఏపీ రీసర్వే ప్రాజెక్టు-2 కింద చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి మండలంలో రెండు గ్రామాలను ఎంపిక చేసి కొత్తగా భూసర్వే చేసి హద్దులు నిర్ధారించనున్నారు. ఈమేరకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఉత్తర్వులు జారీచేశారు. మారిన ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం గ్రామాల్లో భూ వివాదాల పరిష్కారంతోపాటు రికార్డులను నవీకరించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఎంపిక చేసిన గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులకు భూసర్వే కార్యక్రమాన్ని వివరించనున్నారు. ర్యాలీలు



నిర్వహించి వారిని చైతన్యవంతం చేసేలా మండల, క్షేత్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

పాటించాల్సిన నిబంధనలు ఇవీ..

మండల తహసీల్దార్, సర్వేయర్లు ఆయా గ్రామాల్లో భూములను 200 నుంచి 250 ఎకరాల వరకు ఒక బ్లాకుగా విభజించి ఒక్కో దానికి ఒక సర్వే బృందాన్ని కేటాయించాలి. ఆ బ్లాకు పరిధిలోని భూముల రైతులకు రీసర్వేకు సంబంధించిన సమాచారం నోటీసుల ద్వారా తెలియజేయాలి. వారి మొబైల్ నంబర్లతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి సమాచారం ఎప్పటికప్పుడు అందులో ఉంచాలి. మండల తహసీల్దార్, సర్వేయరు ఆ గ్రామానికి సంబంధించిన షెడ్యూల్‌ను సిద్ధం చేయాలి. గ్రామ సరిహద్దులు, బ్లాక్ హద్దులు, ప్రభుత్వ భూములు, సంస్థలకు సంబంధించిన భూములు, ప్రైవేటు వ్యక్తుల భూముల వివరాలను సిద్ధం చేయాలి. సర్వే నంబర్ల వారీగా ఉన్న విస్తీర్ణాన్ని ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎల్ఆర్ ఆధారంగా వెబ్‌ల్యాండ్‌లోని ధ్రువీకరించుకోవాలి. రీసర్వేకు ఎంపిక చేసిన గ్రామాల్లో ఆర్డీవోలు గ్రామసభలు నిర్వహించి రైతులకు వివరించాలి. సర్వే కార్యక్రమాలను వీడియో లేదా ఫొటోల ద్వారా చిత్రీకరించి మొత్తం కార్యక్రమం పారదర్శకంగా జరుగుతుందన్న నమ్మకాన్ని కలిగించాలి. రీసర్వేకు నియమితులైన ఉద్యోగులను తహసీల్దార్లు, ఎంపీడీవోలు రిలీవ్ చేయాలి. జిల్లా సర్వేయర్లు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని జేసీ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపనకు వచ్చే వీవీఐపీల కోసం దివాకరపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్



పక్కా పల్లెలకు పాలక పెద్దలు



ఉమ్మడి జిల్లాకు రేపు సీఎం, ఎల్లుండి లోకేశ్ పర్యటన

- ఒకవైపు సముద్రం.. మరోవైపు కొండలే హద్దు
- ఇటు రెక్కాడితేకాని డొక్కాడని బడుగు, బలహీన వర్గాల ప్రజలు
- అటు రెక్కల కష్టం చేసినా ఫలించక వలసపోతున్న బతుకులు
- పర్చూరు, కనిగిరి ఎమ్మెల్యేలు ఏలూరి, ఉగ్ర వ్యూహాత్మక అడుగులు
- చంద్రబాబు, లోకేశ్‌ల స్పందనపై భారీగా ఆశలు పెట్టుకున్న ప్రజానీకం

మారుమూల పల్లెటూర్లు. ఒకవైపు సముద్రమే హద్దుగా ఉన్న కుగ్రామాలు. మరోపక్క కొండలే హద్దుగా ఉన్న వలస బతుకులకు నిలయమైన పల్లెలు. ఎన్నడూ ఉన్నత స్థాయి పాలక ప్రభువులు చూడని ఊర్లు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అలాంటి గ్రామాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌లు రాబోతున్నారు. వారు రావడమే ఆనందం అయినప్పటికీ తమ బతుకుల బాగుకు, సామాజిక అభివృద్ధికి వారు ఇచ్చే హామీల కోసం అక్కడి ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. పర్చూరు నియోజకవర్గానికి సీఎం మంగళవారం రానున్నారు. అలాగే కనిగిరి నియోజకవర్గానికి ఆయన కుమారుడైన మంత్రి నారా లోకేష్, పారిశ్రామిక దిగ్గజమైన రిలయన్స్ సంస్థ అధిపతుల్లో ఒకరైన అనంత్ అంబానీ బుధవారం వస్తుండటంతో పండుగ వాతావరణం నెలకొంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతినెలా 1వ తేదీన రాష్ట్రంలో ఏదో ఒక నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీకి వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పర్యాయం అందుకు పర్చూరును ఎంచుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రిలయన్స్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో అందుకు నాంది పలికేందుకు కనిగిరి నియోజకవర్గానికి నారా లోకేష్, అనంత్ అంబానీలు వస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిలు మారుమూల పల్లెలకు వారిని తీసుకెళ్లి అక్కడే ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం విశేషం.

కొండ ప్రాంతంలోనే లోకేష్ సభ

వలసలకు నిలయమైన కనిగిరి నియోజకవర్గంలో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం పలకనుండటం అక్కడి ప్రజల్లో కొత్త ఆశలను రేపింది. పీసీపల్లి మండలం దివాకరపల్లి గ్రామ సమీపంలోని కొండ ప్రాంతాల్లో బుధవారం లోకేష్, అనంత్ అంబానీల కార్యక్రమం జరగనుంది. నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధి కోసం పరిశ్రమలు రాబట్టేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిన ఎమ్మెల్యే ఉగ్ర. రిలయన్స్ సంస్థను తీసుకు రావడంలో సఫలీకృతులయ్యారు. రాష్ట్రంలో రిల యన్స్ బయోగ్యాస్ ఉత్పత్తి యూనిట్ల నిర్మాణానికి సిద్ధమైంది. తొలి యూనిట్ కనిగిరిలో ఏర్పాటు చేసేందుకు లోకేష్ ఆసక్తిచూపడంతో ఉగ్ర కల నిజమైంది. అయితే కొండకు దిగువన జన సంచారం లేని ప్రాంతంలో కార్యక్రమం ఏర్పాటుకు అవకాశం లేదని అధికారులు చెప్పినా పట్టుబట్టి ఆ ప్రాంతాన్ని చదునుచేసి భూమిపూజ చేయిస్తానని ఒప్పించగలిగారు. దారి కూడా సరిగా లేని ఆ ప్రాంతానికి ఆగమేఘాలపై రోడ్డును నిర్మింపజేశారు. కొండకు దిగువన 25 ఎకరాలను నాలుగు రోజుల్లో బాగు చేయించారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. విషయం తెలిసి నియోజకవర్గ ప్రజలు గత నాలుగు రోజులుగా ఆ ప్రాంతానికి వెళ్లి అక్కడ జరిగిన ఏర్పాట్లు చూసి ఆశ్చర్యచకితులవుతున్నారు. రెండు హెలికాప్టర్లు దిగేందుకు, వేలాది మందితో సభ నిర్వహణకు ఏర్పాట్లు జరిగిపోయాయి.

బతుకులు మారతాయని ఆశలు

చుక్క నీరు దొరక్క, పనులు లేక వలస బతుకులకు నిలయమైన కనిగిరి నియోజకవర్గంలో రిలయన్స్ సంస్థ ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి నాంది పలికే కార్యక్రమం ఏర్పాటు చేయడం యావత్తు ప్రజానీకంలో చర్చనీయాంశమైంది. ఉపాధి కల నిజమై ప్రభుత్వ భూములు అపారంగా ఉన్న నియోజకవర్గంలో మరిన్ని పరిశ్రమల స్థాపన జరిగితే ప్రజల ఆశలు నెరవేరేం దారి ఏర్పడవచ్చునే భావన నెలకొంది. మరి బుధవారం అక్కడకు రానున్న లోకేష్, అనంత్ అంబానీలు నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధికి సంబంధించి ఎలాంటి వరాలు ఇస్తారన్న అంశంపై అందరూ దృష్టి సారించారు. ఒక ట్రిపుల్‌ఐటీ నిర్మాణం, మరోవైపు సోలార్ ప్రాజెక్టులపై ఉన్న ఆశలకు సంబంధించి లోకేష్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది వేచిచూడాల్సి ఉంది.

పర్చూరు నియోజకవర్గానికి సీఎం

పర్చూరు నియోజకవర్గానికి రావాలని చంద్రబాబు నిర్ణయించుకోవడంతో సహజంగానే రాజకీయంగా ఏదో ఒక కీలకమైన గ్రామంలో లేక కూడలి ఊరిలో కార్యక్రమం ఏర్పాటు చేస్తారని అందరూ భావించారు. కానీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియోజకవర్గంలోని కుగ్రామమైన కొత్తగొల్లపాలెంలో కార్యక్రమం ఏర్పాటు చేయించారు. చినగంజాం మండలంలోని పెద్దగంజాం పంచాయతీ పరిధిలో కొత్తగొల్లపాలెం ఉంది. సముద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆ ఊరిలోనే కాక పెద్దగంజాం పంచాయతీ మొత్తంలో కూడా బడుగు, బలహీనవర్గాల ప్రజలే అధికం. గ్రామంలో సరైన రోడ్డు సౌకర్యం, వసతులు లేకపోయినా పట్టుబట్టి ఏలూరి అక్కడ సీఎం కార్యక్రమం ఏర్పాటు చేయించారు. దీంతో కొత్తగొల్లపాలెం వాసుల్లోనే కాక ఆ చుట్టూ ఉన్న తొమ్మిది గ్రామాల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత నాలుగురోజుల నుంచి అక్కడకు వచ్చిపోయే అధికారులు, ప్రజాప్రతినిధులతో సందడి నెలకొంది. అంతేకాక ప్రజల సమస్యలను ఇంటింటికీ వెళ్లి అధికారపార్టీ నాయకులు, అధికారులు ఆరా తీస్తుండటం కూడా ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తోంది.

ఊతమిస్తారని ఎదురుచూపులు

ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి ప్రతిపాదించిన ఓడరేవు, పల్లెపాలెం ప్రాంతంలో షిప్‌యార్డు నిర్మాణం లాంటి అంశాలపై ముఖ్యమంత్రి స్పందన కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తొమ్మిది గ్రామాలకు కూడలిగా ఉన్న పెద్దగంజాంలో సైతం ఇసుక నేలలే తప్ప కనీసం సిమెంట్ రోడ్లు కూడా లేని పరిస్థితి. అర్హత ఉండి పింఛన్లు అందుకోని ప్రజానీకం కూడా అపారంగా ఉంది. సబ్సిడీతో ఇచ్చే స్ప్రింక్లర్లు లాంటి వ్యవసాయ పథకాలు వినియోగంలో లేని దుస్థితి. ఇక నియోజకవర్గస్థాయిలో అయితే సాగునీటి వనరుల అభివృద్ధికి సంబంధించి సమస్యలు కోకొల్లలు. అయితే ముఖ్యమంత్రి తమ ప్రాంతానికి వస్తున్నారని తెలిసి మురిసిపోతున్న ప్రజలు ఆయన తమ జీవనోపాధికి ఊతమిస్తారని ఆశగా చూస్తున్నారు.



చంద్రబాబు పర్యటన నేపథ్యంలో కొత్తగొల్లపాలెంలో పింఛన్ లబ్ధిదారు తల్లితో మాట్లాడుతున్న బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట, పక్కన ఎమ్మెల్యే ఉగ్ర

రైతుల మేలు కోసమే బయోగ్యాస్ ప్లాంట్

- ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మేలు చేకూర్చే ఉద్దేశంతో రిలయన్స్ సంస్థ ద్వారా బయోగ్యాస్ యూనిట్‌ను కనిగిరి నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వెల్లడించారు. స్థానిక రామనగర్‌లోని తన కార్యాల యంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. రిలయన్స్ సంస్థకు సొంత భూములు కౌలుకు ఇస్తే ఎకరాకు సంవత్సరానికి రూ.31,000 ఇస్తారన్నారు. సొంతంగా సాగు చేసే రైతులకు సంస్థ విత్తనాలు, ఎరువులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ప్రోత్సహిస్తుందన్నారు. అలా సాగు చేయడం వల్ల రూ.60వేలకుపైగా ఆదాయం లభిస్తుందని తెలిపారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న రిలయన్స్ సంస్థ రూ.66వేల కోట్లతో 550 యూనిట్లను పెట్టాలని నిర్ణయించగా, అందులో మొట్టమొదటిగా కనిగిరి ప్రాంతంలో బయోగ్యాస్ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. మంత్రి లోకేష్ కనిగిరి ప్రాంత సమస్యలను గుర్తుంచుకొని పరిశ్రమ శంకుస్థాపనకు రానుండటం శుభపరిణామమన్నారు. అనంత్ అంబానీ రావడం వల్ల కనిగిరి ప్రాంతానికి ఎంతో మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ మాగుంట ద్వారా సీఎస్ఆర్ నిధులు రాబట్టి కనిగిరి ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఏర్పాటు చేస్తామన్నారు.



నమాజ్‌కు సిద్ధమైన మార్కాపురంలోని పెద్దఈద్గా

దాతృత్వానికి ప్రతీక రంజాన్

5

- పేదలకు దానం చేయటం ముఖ్య ఉద్దేశం
- నేడు రంజాన్ పండుగ
- ప్రార్థనలకు ఈద్గాలు సిద్ధం

అవీ..ఇవీ



ఎంపీ మాగుంటకు బొకే ఇస్తున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర

మాగుంటను కలిసిన ఎమ్మెల్యేలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్‌ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుండె సర్జరీ చేయించుకున్న అనంతరం ఒంగోలు వచ్చిన మాగుంటను స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మాగుంటకు బొకే ఇచ్చి అభినందించారు. ఈసందర్భంగా మాగుంట ఆరోగ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కందుకూరు శాసనసభ్యుడు ఇంటూరి నాగేశ్వరరావు మాగుంటకు బొకే ఇచ్చి అభినందించారు.

రంజాన్ శుభాకాంక్షలు

ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి జిల్లాలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎంపీ ఆకాంక్షించారు



పూలమొక్క ఇచ్చి కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

చలివేంద్రం ప్రారంభం

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఫౌండేషన్ ఆధర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నగర కమిషనరు కే. వెంకటేశ్వరరావు, టు టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం వేసవిలో ప్రజలకు దాహార్తి తీరుస్తుందన్నారు. నిర్వాహకులు డాక్టర్ బొల్లినేని నటరాజకృష్ణ, డాక్టర్ బైరపనేని రామాంజనేయులు, డాక్టర్ బైరపునేని పవన్‌కుమార్ మాట్లాడుతూ నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పా తూరి మురళీకృష్ణ, మలినేని కోటేశ్వరరావు, సురవరపు శ్రీను, బిజ్జం శ్రీనివాసుల రెడ్డి, బైరపునేని తిరుమల దేవి, బైరపునేని సన్నీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



తోఫా పంపిణీ సందర్భంగా మాట్లాడుతున్న శ్రీరాం హాస్పిటల్ ఎండీ వంశీకృష్ణ

పేద ముస్లింలకు తోఫా పంపిణీ

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రంజాన్‌ను పురస్కరించుకుని శ్రీరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఆదివారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చాపల వంశీకృష్ణ, ఆయన సతీమణి డాక్టర్ చాపల శాంత కుమారి ముఖ్య అతిథులుగా హాజరై తోఫా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ్ హాస్పిటల్ పేద ప్రజల సేవలకు ఎల్లప్పుడు ముందు ఉంటుందని అన్నారు.అనంతరం వందమంది ముస్లిం కుటుంబాలకు బియ్యం, పప్పు దినుసులతో కూడిన 15 రకాల వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, సూర్య దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ బాషా, షేక్ జానీ బాషానబీ కరిముల్లా, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే ఫ్లైవోవర్ వంతెనపై నడక దారిలో దెబ్బతిన్న సిమెంట్ బండలు

రైల్వే ఫ్లైవోవర్ వంతెనపై దెబ్బతిన్న ఫుట్‌పాత్

● ఇబ్బంది పడుతున్న పాదచారులు

ఒంగోలు(రూరల్)మార్చి30(ఆంధ్రజ్యోతి):ఒంగోలు నుంచి కొప్పోలు వెళ్లే రైల్వే ఫ్లైవోవర్ వంతెనకు ఇరువైపులా ఉన్న (ఫుట్‌పాత్)కాలిబాట సిమెంట్ బండలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో పాదాచారులు కాలిబాట మార్గంలో నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లైవోవర్ వంతెన కూడా చిన్నది కావటంతో పాదచారులు కాలిబాట మార్గాన కాకుండా వాహనాలు ప్రయాణించే రోడ్డులో నడుస్తున్నారు. దీంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కాలిబాట మార్గంలో (ఫుట్‌పాత్) సిమెంట్ బండలను నూతనంగా నిర్మించి ఇబ్బందులు తీర్చాలని పాదచారులు కోరుతున్నారు.

రవిశంకర్ జన్మదిన వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రవిశంకర్ గ్రూప్‌అధినేత, జనసేన పార్టీ నాయకుడు కంది రవిశంకర్ జన్మదినవేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మరాఠిపాలెంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను రవిశంకర్ కట్ చేశారు. ఈసందర్భంగా పలువురు రవిశంకర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు చనపతి రాంబాబు, చిట్టెం ప్రసాద్, ముత్యాల కళ్యాణ్, బొందిల శ్రీదేవి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

పలుచోట్ల పంచాంగ శ్రవణాలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ఉగాది సందర్భంగా సీతారాంపురంలో నారసింహ కల్యాణం నిర్వహిస్తున్న రుత్విక్కులు

ఒంగోలు (కల్చరల్),మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రజలు ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను అత్యంత ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనేక చోట్ల పంచాంగ శ్రవణం జరిగింది. పండుగ సందర్భంగా జిల్లాలోని పలు చిన్న, పెద్ద ఆలయాలను ప్రజలు దర్శించుకుని పూజలలో పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని పలు దేవాలయాలకు ఆదివారం ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. స్థానిక శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రముఖ వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి శాస్త్రిచే పంచాంగ శ్రవణం జరిగింది.

అటు స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరం, సంతపేట సాయిబాబా మందిరం, తూర్పుపాలెం శివాలయం, కేశవస్వామిపేట ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, గంగా పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం, విజయ దుర్గా దేవస్థానం, వీరాంజనేయ స్వామి దేవస్థానం, లాయర్‌పేట చిట్టి ఆంజనేయ స్వామి దేవస్థానం, మంగమూరు రోడ్డు అచలానంద ఆశ్రమం, రాంనగర్ సీతారామచంద్ర స్వామి దేవస్థానం, ఐశ్వర్యనగర్ రామాలయం తదితర పలు ప్రధాన ఆలయాలలో ఉగాది వేడుకలు నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆరంభమైన వసంత నవరాత్రులు

ఉగాది పండుగ నుంచి శ్రీరామనవమి వరకు తొమ్మిది రోజులు నిర్వహించే వసంత నవరాత్రులు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైనాయి. స్థానిక సీతారామపురం మామిడిపాలెం కొండ మీద ఉన్న శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు డాక్టర్ రామచంద్రుని రమేష్ కృష్ణ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేశారు.

కమనీయం నారసింహ కల్యాణం

ఒంగోలు (కల్చరల్): ఉగాది పండుగ సందర్భంగా స్థానిక సీతారాంపురంలో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన శ్రీ లక్ష్మీ నారసింహ కల్యాణోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై లక్ష్మీ నారసింహుల ఉత్సవమూర్తులను ఉంచి రుత్విక్కులు ఆగమ శాస్త్ర ప్రకారంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలశారాధన, విష్వక్సేన పూజ, కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, మాంగల్య పూజ, మాంగల్య ధారణ, పట్టు వస్త్రాల సమర్పణ తదితర క్రతువులను రుత్విక్కులు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రంగారాయుడు చెరువు వద్ద..

ఒంగోలు, కలెక్టరేట్ : స్థానిక రంగారాయుడు చెరువు వద్ద ఉన్న జిమ్‌లో షైనం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకుల ద్వారా పంచాంగ శ్రవణం అనంతరం ఉగాది పచ్చడి, పొంగలి,పులిహోరలను ప్రసాదంగా పంచిపెట్టారు. ముస్లింలకు రంజాన్‌తోఫాగా హాట్ బాక్సులు, స్వీటు బాక్సులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జీఎ్‌స్టీవో కొండలరావు, పోకూరి శేషారావు, కొప్పోలు శ్రీనివాసరావు, బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస నాయుడు, హుస్సేన్, గంగాధర్, శ్రీదేవి, షాలిని, భారతి, లక్ష్మీ,రమాప్రసాద్, సుజాత, శ్రీలత తదితరులు ఉన్నారు.

నాగులుప్పలపాడులో

నాగులుప్పలపాడు :విశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలను ఆదివారం మండల పరిధిలోని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవస్థానాలలో వేద పండితులు పంచాగ శ్రవణం వినిపించారు. తెలుగు సంవత్సరాది సందర్భంగా ఆనవాయితీ ప్రకారం ఉప్పుగుండూరు గ్రామంలో పోలేరమ్మ తల్లి కొలుపులను ఘనంగా నిర్వహించారు.

మద్దిపాడులో..

మద్దిపాడు :ఉగాది పండుగ సందర్భంగా మల్లవరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం రవికుమార్, నారాయణం రాజశేఖర్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహించారు.

ఇరువురికి కళారత్న ఉగాది పురస్కారాలు



సీఎం నుంచి పురస్కారం అందుకుంటున్న అరుణ, అంకమ్మరావు

ఒంగోలు (కల్చరల్),మార్చి 30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కళారత్న ఉగాది పురస్కారాలను జిల్లాకు చెందిన రచయితలు, సంగీత కళాకారులు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా అందుకున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రి, సామాజిక సేవకురాలు, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, ప్రముఖ కవి, కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మ రావులు సాహిత్యరంగంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా పురస్కారాలను ముఖ్యమంత్రి నుంచి అందుకున్నారు. వీరికి పురస్కారం తోపాటు శాలువ, జ్ఞాపిక, రు.10 వేల నగదును బహుమతిగా అందించి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా సంగీత రంగంలో ఒంగోలుకు చెందిన సి.హెచ్.నాగేశ్వరమ్మకు సైతం పురస్కారం, జ్ఞాపిక, నగదు బహుమతిని అందజేశారు.

10న అగ్రహారం భూముల పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలో ఇళ్లు లేని పేదలకు గతవైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసిన అగ్రహారం భూములను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ వచ్చేనెల 10వతేదీన పరిశీలిస్తారని ఆపార్టీ జిల్లాకార్యదర్శి ఎంఎల్ నారాయణ తెలిపారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం ఒంగోలు నియోజకవర్గ సమావేశానికి నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో అగ్రహారం, వెంగముక్కలపాలెం వద్ద కొనుగోలు చేసి లే అవుట్ వేసి 22వేల మంది లబ్ధిదారులకు ఒక్కొక్క సెంటు చొప్పున పట్టాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అందులో ఎక్కువ మంది అనర్హులు ఉన్నారనే సాకుతో మొత్తం పట్టాలు రద్దు చేసి కొత్త జాబితాను తయారు చేస్తామని ప్రకటించడం సరైంది కాదన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు వెంటనే లే అవుట్‌ను మార్చి స్థలాలను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. భూముల పరిశీలన అనంతరం కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో రామకృష్ణ పాల్గొంటారన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

పోలీసు క్వార్టర్స్‌లో ఉగాది వేడుకలు

ఒంగోలు క్రైం,మార్చి30(ఆంధ్రజ్యోతి): పోలీసు క్వార్టర్స్‌లోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పంచాగ శ్రవణం రమణ దీక్షితులు, దక్షిణామూర్తి చేశారు. జిల్లా ప్రజలకు ఎస్పీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ,ఆర్ ఎస్సైలు సీతారామిరెడ్డి ,రమణారెడ్డి, ఖాసీమ్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

పొన్నలూరు : ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం పొన్నలూరులో విశ్వావసునామ సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా, దేశభక్తి గీతాల ఆలపాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. కార్యక్రమంలో విశ్రాంత ఎక్సైజ్ ఉద్యోగి కలవకూరి చెన్నయ్య, విశ్రాంత పంచాయతీ కార్యదర్శి ఎం.చలపతిరావు, స్వయం సేవకులు పాల్గొన్నారు.

50 శాతం వడ్డీ రాయితీతో పన్నుల చెల్లింపునకు నేడే ఆఖరు

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : యాభై శాతం వడ్డీ రాయితీ ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించుటకు అలాగే నీటి పన్నులు చెల్లించుటకు సోమవారం ఆఖరు అని నగర కమిషనరు కే. వెంకటేశ్వరరావు తెలిపారు. సంబంధిత గృహ యజమానులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు చెల్లించాల్సిన పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. లేని పక్షంలో రేపటి నుంచి ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న బకాయితోపాటు వడ్డీపై వడ్డీ వసూలు చేస్తామని కమిషనరు తెలిపారు. అంతేకాకుండా పన్ను బకాయిలు ఉన్న ఇళ్లకు నీటి కనెక్షన్, కరెంటు కట్ చేస్తామని, షాపులకైతే తాళాలు వేస్తామని తెలిపారు. సోమవారం రంజాన్ పండుగ అయినప్పటికీ కార్పొరేషన్ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లు, అలాగే సచివాలయాలలో పన్నులు చెల్లించవచ్చని కమిషనరు తెలిపారు.



మంత్రి స్వామి నుంచి పురస్కారం అందుకుంటున్న కమిషనర్

నగర కమిషనర్ వెంకటేశ్వరరావుకు ఉగాది పురస్కారం

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావుకు ఉగాది పురస్కారం లభించింది. ఆదివారం ఒంగోలులోని రామనగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకలకు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ముఖ్య అతిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఓఎంసీ కమిషనరు వెంకటేశ్వరరావు 'అమరావతి..ఆంధ్రుల కీర్తి కిరీటి' పేరుతో రచించిన కవితకు ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా కమిషనరును మంత్రి స్వామి,జేసీ గోపాలకృష్ణ, మాల కార్పొరేషన్ ఛైర్మన్ విజయ్‌కుమార్‌తోపాటు పలువురు అభినందించారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

సింగరాయకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వాసవి క్లబ్ న్యూ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ జోన్-1 ఛైర్మన్ కొత్తూరి నటరాజకుయారి, రీజనల్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

సమ్మోహనంగా స్వర రాగ గంగా ప్రవాహం

సంప్రదాయ దుస్తులలో అలరించిన ఉపాధ్యాయులు

ఆకట్టుకున్న సంగీత విభావరి



మాట్లాడుతున్న డీఈవో కిరణ్ కుమార్

ఒంగోలు (కల్చరల్),మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు ఏకమై, జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన స్వర రాగ గంగా ప్రవాహం సంగీత విభావరి ప్రేక్షకులను సమ్మోహపరిచింది. ఇందులో పాల్గొన్న డీఈవో కిరణ్‌కుమార్‌తో సహా ఉపాధ్యాయులందరూ తెలుగు సంప్రదాయ వేషధారణలో వచ్చారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము గంజాం శేషగిరి రావు కళాప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ముందుగా డీఈవో కిరణ్‌కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయ గాయనీ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఇటు ఉపాధ్యాయ వృత్తిని నిర్వహిస్తూనే అనేకమంది సంగీతం పట్ల ఆసక్తితో సాధన చేయటం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆయనే స్వయంగా వ్యాఖ్యాతగా ఉంటూ కార్యక్రమాన్ని నడిపించారు. అనంతరం వీఎస్ బాలాజీ, తన్నీరు బాలాజీ, సంజయ్, డి.వెంకటేష్, వెంకట్, రమణ మూర్తి, మణిరాజ్, భానుప్రతాప్, జయరాజ్, రాజకుమారి, స్వర్ణలత, షకీల, శైలజ, సుహాసినీ పాత కొత్త చిత్రాలలోని పలు గీతాలను రసరమ్యంగాఆలపించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు.

తెలుగు భాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఒంగోలు (కల్చరల్),మార్చి 30(ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ మంత్రి డాక్టర్ దగ్గుబా టి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం రాత్రి స్థానిక పాటిబండ్ల గోపాలస్వామి కల్యాణ మండపంలో జిల్లా కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుభాష ఎంతో గొప్పదని పద్యం, అష్టావధానం వంటి అనేక ప్రక్రియలు కేవలం తెలుగులోనే ఉన్నాయని అన్నారు. అనంతరం ఆయనను సేవాసమాఖ్య కార్యవర్గంతోపాటు పలువురు ఘనంగా సన్మానించారు. పంచసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ ఆధ్వర్యంలో అష్టావధానం నిర్వహించగా ఆచార్య జి.దామోదర నాయుడు సంచాలకునిగా, పలువురు సాహితీవేత్తలు పృచ్ఛకులుగా వ్యవహరించారు. అదేవిధంగా డాక్టర్ నాగభైరవ ఆదినారాయణకు 2025 జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. దివంగత డాక్టర్ మండవ నరసింహారావు రచించిన పలు పుస్తకాలను సైతం డాక్టర్ దగ్గుపాటి వెంకటేశ్వర రావు ఆవిష్కరించగా, గుళ్లకమ్మ పదాలు పుస్తకాన్ని డాక్టర్ మేడసాని మోహన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), మాజీ శాసనసభ్యులు ఈదర హరిబాబు, ఏపీ కాకతీయ సేవా సమాఖ్య అధ్యక్షుడు వెలగపూడి గోపాలకృష్ణ ప్రసాద్, నిడమానూరి నాగేశ్వరరావు, డాక్టర్ కంచర్ల రామయ్య, ఎర్రమనేని కోటేశ్వరరావు, గోరంట్ల రవికుమార్, ఈదర మోహన్, నల్లూరి వెంకటేశ్వర్లు, తేళ్ల అరుణ, తేళ్లపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొనగా కాకతీయ సేవా సమాఖ్య గౌరవాధ్యక్షుడు గనిపినేని అంజయ్య, అధ్యక్షులు వీరవల్లి రుద్రయ్య, ఇతర పాలక వర్గ సభ్యులు కార్యక్రమ పర్యవేక్షణ చేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

ఒంగోలు క్రైం,మార్చి30(ఆంధ్రజ్యోతి): మంగమూరు రోడ్డులోని మద్యం దుకాణం వద్ద శనివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువురికి గాయాలు అయ్యాయి. ఎన్‌జీవో కాలనీకి చెందిన చల్లా విషాల్, వెంగముక్కపాలెంనకు చెందిన వలేటి వెంకటేష్‌లు తన స్నేహితులతో మద్యం సేవిస్తున్న సమయంలో మాటా మాటా పెరిగి ఘర్షణకు దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు రావడంతో వివాదం సర్దుమణిగింది.

వాహనం ఢీకొని యువకునికి గాయాలు

మద్దిపాడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి):గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకునికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మద్దిపాడు వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు మీసేవ నిర్వాహకుడు శ్రీకాంత్ ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో శ్రీకాంత్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

దామచర్ల రంజాన్ శుభాకాంక్షలు

ఒంగోలు, కార్పొరేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం సోదరులకు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగనుప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని తెలిపారు.

ఒంగోలు క్రైం : రంజాన్ పర్వదినం సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

ఆలయంలో బీఎన్ ప్రత్యేక పూజలు

మద్దిపాడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాచవారిపాలెం జనార్దన స్వామి ఆలయంలో సంతనూతలపాడు శాసనసభ్యులు విజయ్ కుమార్ ఆదివారం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని అన్నారు.

క్రైస్తవుల కొవ్వొత్తుల ర్యాలీ

నాగులుప్పలపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మృతికి నిరసనగా ఉప్పుగుండూరు గ్రామంలో పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవులు గ్రామంలోని గంగమ్మ హోటల్ కూడలి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఆదివారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.కార్యక్రమంలో ఎస్ఎన్‌పాడు పాస్టర్స్ యూనియన్ జేఏసీ అధ్యక్షులు కుందా లింగేష్ అబ్రహం, వివిధ సంఘాల క్రైస్తవులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్

మద్దిపాడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి):మద్దిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని ఆశాఖ ఏఈ చెన్నారెడ్డి ఆదివారం తెలిపారు. అధికారికంగా కానీ అనధికారికంగా కానీ విద్యుత్ కోతలు విధించడం లేదని అన్నారు.

రాజీవ్ గాంధీ విగ్రహం కూల్చివేత హేయం

ఒంగోలు క్రైం,మార్చి30(ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ విగ్రహం కూల్చివేత వెనుక బీజేపీ కుట్ర ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సైదా మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కార్పొరేషన్ అధికారులు కూల్చివేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మే 21 లోపు ఏర్పాటు చేయకుంటే ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

వైభవంగా జాళ్లపాలెం తిరునాళ్ల



- వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి పోటెత్తిన భక్తులు
- నాలుగు విద్యుత్ ప్రభల ఏర్పాటు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొండపి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది సందర్భంగా మండలంలోని జాళ్లపాలెం వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. పొంగళ్లు పెట్టుకొని, తలనీలాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకొన్నారు. మఠం వద్ద ఉన్న ధునిలో ఎండు కొబ్బరి వేసి మొక్కులు తీర్చుకున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు తిరునాళ్లకు వచ్చిన వారికి పులిహోర, మంచినీళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశాయి. మఠం పరిసరాల్లో వివిధ సంఘాల వారు ఉచితంగా అన్నదానం చేశారు. పెట్లూరు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాత్రికి వివిధ గ్రామాలకు చెందిన వారు నాలుగు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. వాటిపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పాట కచేరీలు అలరించాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న సత్య

వీరబ్రహ్మేంద్ర స్వామిని ఆదివారం రాత్రి ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య దర్శించుకున్నారు. ఈసందర్భంగా మఠం నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ప్రభలపై ప్రజలను ఉద్దేశించి సత్య మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రైవేటు నిర్వాహకులు చిన్నారుల ఆహ్లాదం, ఆనందం కోసం జెయింట్‌వీల్, మినీ ట్రైన్స్, జారుడు బల్లలు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నం, పులిహోర, మంచినీరు బాటిళ్లు, మజ్జిగ ఉచితంగా అందజేశారు. ముగ్గురు సీఐలు, పదిమంది ఎస్సైలు, 200 మంది కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహించారు.





చెట్టు చెంత.. మాకేల చింత...!

మార్కాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఉదయం 11.00 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఏప్రిల్‌కు ముందే 40 డిగ్రీల చేరువకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రెండురోజులుగా మధ్యాహ్న సమయంలో వడగాల్పులు కూడా ఎక్కువయ్యాయి. వేసవి తాపానికి మనుషులతో పాటు మూగజీవాలు కూడా అల్లాడుతున్నాయి. నీడ దొరికితే చాలు ఎక్కడపడితే అక్కడే ఉంటున్నాయి. తర్లుపాడు మండలంలోని కారుమానుపల్లిలో ఓ వేపచెట్టు కింద ఎండల తీవ్రత తట్టుకోలేక చెట్టు కిందకు గొర్రెలు చేరాయి. వాస్తవానికి పొలాల్లోకి వెళ్లిన మేకలు, గొర్రెలు మేతకోసం గెట్టు, గెనాల వెంబడి తిరుగుతుంటాయి. కానీ వేసవి తాపాన్ని కట్టుకునేందుకు అన్నీ నీడలోనే సేదతీరాయి.

కల్యాణం.. కమనీయం.!

సింగరాయకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఉగాది సందర్భంగా మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, యోగానంద లక్ష్మీనరసింహ స్వామి, స్వయంభు ఆంజనేయుడిని ప్రత్యేక పూలతో అలకరించారు. సాయంత్రం వేలమూరి ప్రభాకర్‌రావు పంచాంగ శ్రావణం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామికి వైభవంగా కల్యాణం నిర్వహించారు. అలయ ఈవో పి.కృష్ణవేణి, ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

దాతృత్వానికి ప్రతీక రంజాన్



ఒంగోలు కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ బోధనలలో అతి ముఖ్యమైనది దాతృత్వం(దానగుణం). దీనిని ప్రతి ఒక్కరూ అలవర్చుకుని ఆచరించాలనే ఉద్దేశంతో ఒక సందర్భాన్ని ఏర్పాటు చేశారు. అదేరంజాన్ పండుగ. సంవత్సరంలో ఇస్లాం ధర్మం ముస్లింల కోసం రెండు ముఖ్యమైన పండుగలను పేర్కొంది. అందులో ఒకటి ఈద్ ఉల్ ఫితర్‌గా పిలిచే రంజాన్ పండుగ అయితే.. రెండోది ఈద్ ఉల్ అజ్‌హాగా పిలవబడే బక్రీద్. ఇందులో రంజాన్ పండుగ దానానికి ప్రతీక. ఈద్ ఉల్ ఫితర్ పేరులో ఉన్నట్లు ఫిత్రా అంటే దానం అని అర్థం. అంటే ఈ పండుగ తమ కంటే పేదలకు తమకు ఉన్న దాంట్లో నుంచి కొంత దానాన్ని ఇవ్వటం. అటువంటి మహోన్నతమైన ఆశయం దాగి ఉన్న రంజాన్ పండుగను నెల రోజుల ఉపవాస దీక్ష తర్వాత ముస్లింలు సోమవారం నిర్వహించుకోనున్నారు. ఈ ఏడాది మార్చి 2 నుంచి ఈ దీక్షలు ప్రారంభమయ్యాయి.

● సామరస్యతకు ప్రతీకగా ఇఫ్తార్ విందులు

రంజాన్ నెల సందర్భంగా ముస్లిం సంఘాల ఆధ్వర్యంలోనే కాకుండా రాజకీయ పార్టీలు, ఇతర మతాలకు చెందిన స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇవ్వటం పరిపాటి. మతసామరస్యానికి ఇఫ్తార్ విందులు ప్రతీకగా నిలిచాయి.

● ఈద్గాలు సిద్ధం

రంజాన్ ప్రార్థనల కోసం జిల్లాలోని పలు ఈద్గాలు సిద్ధమయ్యాయి. ఒంగోలు నగరం కొణిజేడు బస్టాండ్ దగ్గర ఉన్న ఈద్గా మైదానంలో వేలాది మంది ముస్లింలు సోమవారం ఉదయం ప్రార్థనలలో పాల్గొంటారు. వారి చేత ఇస్లాం మత పెద్దలు ప్రార్థనలు చేయించి, మహమ్మద్ ప్రవక్త సందేశాలను వినిపిస్తారు. అందుకోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా జిల్లాలోని పలు ఈద్గాలు, చిన్నా పెద్ద మసీదులలో సైతం రంజాన్ ప్రార్థనలు జరగనున్నాయి.

● పలువురి శుభాకాంక్షలు

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు పలువురు శుభాకాంక్షలను అందజేశారు. మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, జిల్లా కలెక్టర్ అన్సారియా, ఎస్పీ దామోదర్, నగర మేయర్ గంగాడ సుజాతలు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.


ఒంగోలులో ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా

కర్ణాటక భక్తులకు అల్పాహారం అందజేత


భక్తులకు అల్పాహారం అందజేస్తున్న నిర్వాహకులు

మార్కాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కాపురం రైల్వేస్టేషన్‌లో కర్ణాటక వెళ్లే భక్తులకు ఉగాది అన్నదాన సేవాసంఘం అల్పాహారం పంపిణీ చేశారు. ఉగాదికి శ్రీశైలంలో దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో రైల్వేస్టేషన్‌కు చేరుకునే వేలాది మంది కన్నడ భక్తులకు ఏటా మాదిరిగానే ఆదివారం కూడా అల్పాహారాన్ని అందించారు. స్టేషన్ బయట ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్లలో అల్పాహారంతోపాటు శుద్ధజలాన్ని కూడా వారికి తగినంత మేర రాత్రి 10.00 గంటల వరకు అందించారు. ముఖ్య కార్యనిర్వాహకులు చక్కా మాలకొండనరసింహరావు, తాళ్లపల్లి ఆదినారాయణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ ఇస్మాయిల్, చక్కా చిన్నమాలకొండ నరసింహరావు, డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యులు ఆర్‌కేజే నరసింహం, గాయం వెంకటనారాయణరెడ్డి, కొప్పరపు శ్రీనివాసులు, కశ్శెట్టి సుబ్బారావు, కలువ భాస్కర్, డి.మోహన్‌రెడ్డి, చిన్ని పాపిశెట్టి, పల్లా ఓబయ్య, బాబీ పాల్గొన్నారు.

వైభవంగా కాటంరాజు గ్రామోత్సవం

- హాజరైన నూకసాని బాలాజీ, అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబు


టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభపై మాట్లాడుతున్న నూకసాని బాలాజీ, పక్కన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, ఎరిక్షన్‌బాబు


టీడీపీ ప్రభ వద్ద ప్రజలు

పెద్దారవీడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లంచర్ల గ్రామ శివారులో వెలసిన వేనూతల కాటంరాజు తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లలలో ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేనూతల కాటంరాజు, గంగాభవానీ అమ్మవార్ల గ్రామోత్సవంలో పల్లకి మోశారు. అనంతరం టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభలపై మాట్లాడారు. చైర్మన్ బాలాజీ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసమే దివంగత నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తున్నారని చెపారు. బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసమే పీ4 విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. కాటంరాజు తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కులు తీర్చుకున్నారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ, తెలంగాణా రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పీ4 సర్వే.. జిల్లా నుంచి ప్రాతినిధ్యం

- అమరావతిలో ప్రారంభ సభకు ఇక్కడ నుంచి విభిన్న వర్గాల ప్రతినిధులు
- నియోజకవర్గానికి ఒక బస్సు
- మంత్రి స్వామితో సహా పలువురు ప్రజాప్రతినిధులు హాజరు
- జిల్లాలో 3.89 లక్షల కుటుంబాల సర్వే
- అట్టడుగున ఉన్న 20శాతం కుటుంబాలకు లబ్ధి

ఒంగోలు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలోని సచివాలయ ప్రాంతంలో ప్రభుత్వం తరఫున ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల పార్టనర్‌షిప్(పీ4) భారీ సభకు జిల్లా నుంచి వివిధ రంగాల ప్రతినిధులు హాజరయ్యారు. పూర్తిస్థాయిలో పేదరిక నిర్మూలన, అందుకు సమాజ భాగస్వామ్యం లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమాన్ని ఉగాది పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఆ కార్యక్రమానికి ఒక్కొక్క నియోజకవర్గం నుంచి 40 మందితో కూడిన ఒక్కొక్క బస్సును పంపాలని ప్రభుత్వం సూచించింది. అందులో స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు, విద్యార్థులు, ఉపాధి కూలీలు ఉండాలని పేర్కొంది. ఒక్కొక్క బస్సుకు ఒక డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారి పర్యవేక్షణతో పంపాలని ఆదేశించారు. అందుకోసం జిల్లా స్థాయిలో జడ్పీ సీఈవో చిరంజీవిని నోడల్ అధికారిగా నియమించగా ఆయన సమర్థ్యంతో జిల్లా నుంచి 8 బస్సుల్లో ప్రతినిధులు వెళ్లారు. అలాగే రాష్ట్ర మంత్రి డాక్టర్ స్వామితో పాటు పలువురు ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు. ఇదిలా ఉండగా కార్యక్రమంలో లబ్ధిపొందే అట్టడుగు వర్గాలకు చెందిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా, వారికి సహాయపడే పెద్ద కుటుంబాలకు చెందిన వారిని మార్గదర్శిగా ప్రభుత్వం పేరు పెట్టింది. అట్టడుగున ఉన్న కుటుంబాల గుర్తింపు కోసం రాష్ట్ర వ్యాప్తంగా గత నెలాఖరు నుంచి ఈనెల తొలిపక్షం వరకు ప్రత్యేక సర్వే నిర్వహించారు.

జిల్లాలోనూ సర్వే...

జిల్లాలో గ్రామం యూనిట్‌గా 5.89 లక్షల కుటుంబాలను అధికార యంత్రాంగం సర్వే చేశారు. ఆ సర్వేలో కుటుంబ యజమాని, ఇతర సభ్యులు ఏమి చేస్తున్నారు ఆదాయం ఎంత, నెలవారీ ఖర్చు, ఇంట్లో ఉన్న విద్యుత్, గ్యాస్, వాహనాలు, ఇతర గృహోపకరణాల వివరాలు, స్థిరచరాస్తుల వివరాలను సేకరించారు. తద్వారా ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి ఆర్థికంగా అడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నది లక్ష్యం. అలా జిల్లాలో సుమారు లక్షా 20వేల కుటుంబాల వరకు ఈ పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. సర్వే వివరాలను ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రకటించి మార్పులు, చేర్పులకు కూడా అవకాశమిచ్చారు. మొత్తం మీద ఎన్ని కుటుంబాలకు, ఏ విధంగా పీ 4 ద్వారా మేలు జరుగుతుంది.. ఇతరత్రా వివరాలు మరి కొద్ది రోజుల్లో స్పష్టత రానుంది.

అవీ..ఇవీ

రేపు కంటి వైద్యశిబిరం

గిద్దలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణేష్‌నగర్‌లోని కైలాస్ నయన్‌కేర్ సెంటర్‌లో ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 10గంటల నుండి ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కేర్ సెంటర్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలుకు చెందిన అమీలియా ఆసుపత్రి వైద్యాధికారులు శిబిరానికి హాజరై అన్నిరకాల కంటిపరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధాశ్రమంలో దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న సేవాబృందం

బేస్తవారపేట,మార్చి30 (ఆంధ్రజ్యోతి):బేస్తవారపేటకు చెందిన హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థ గిద్దలూరులోని సంజీవిని అనాథ వృద్ధాశ్రమములోని పిల్లలకు ఉగాది పండుగ సందర్భంగా నూతన దుస్తులు అందజేశారు. ఆశ్రమంలోని పిల్లలకు, మానసిక దివ్యాంగులకు అనాథ వృద్ధులకు నిత్యవసర వస్తువులు, మందులు, అందజేశారు. ఉగాది పండుగ రోజున ఆశ్రమంలోని వారందరికి భోజనం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మీసేవా వెంకట రాయుడు పాల్గొన్నారు.

విశాల్‌కు మాస్టర్ డిగ్రీ


స్నాతకోత్సవంలో మాస్టర్స్ డిగ్రీ అందుకుంటున్న విశాల్

మార్కాపురం, మార్చి 30 (ఆంధ్ర జ్యోతి): స్థానిక జార్జి విద్యాసంస్థల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ ఇటీవల ప్రతిష్టాత్మక మేనేజిమెంట్ విద్యాసంస్థ అయిన ఐఐఎం, ఇండోర్ నుంచి మాస్టర్స్ డిగ్రీ అందుకున్నట్లు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్‌రాజబాబు తెలిపారు. ఐఐఎం, ఇండోర్‌లో శనివారం జరిగిన 26వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రఖ్యాత చెస్‌దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, మురుగప్ప గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ డాక్టర్ ఎంఎం మురుగన్‌ల చేతుల మీదుగా డిగ్రీ పట్టాను అందుకున్నారు. అంతేకాక కార్పొరేట్ ఇంటరాక్షన్ కమిటీ సెక్రటరీగా అందించిన సేవలకు ప్రత్యేక ప్రశంసాపత్రాన్ని కూడా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విశాల్‌ను జార్జ్ విద్యాసంస్థల సాంకేతిక సలహాదారులు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, సంస్థలోని హెచ్‌వోడీలు, లెక్చరర్‌లు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

వెలగపూడికి తరలిన ప్రజలు


బస్సును ప్రారంభిస్తున్న ఎంపీడీవో, అధికారులు

మార్కాపురం రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వెలగపూడి వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే పీ-4 సర్వే కార్యక్రమానికి మార్కాపురం మండలం నుంచి వివిధ వర్గాల ప్రజలతో కలిసి బయలుదేరారు. బస్సును ఎంపీడీవో శ్రీనివాసులు, అధికారులు కలిసి ప్రారంభించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి గుంటూరు జిల్లా వెలగపూడిలో నిర్వహించే పీ-4 సర్వే ప్రారంభం, ఉగాది పండుగ కార్యక్రమానికి ఆదివారం బస్సు బయలుదేరింది. రైతులు, విద్యార్థులు, మహిళలు, దారిద్ర రేఖకుదిగువ ఉన్నవారిని ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరయ్యేందుకు తీసుకెళ్లినట్లు బస్ లైజనింగ్ అధికారి డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పిచ్చయ్య, రెవెన్యూ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంరూరల్ : రాష్ట్రంలో పీ-4 సర్వే కార్యక్రమం భాగంగా ఆదివారం నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెలగపూడి గ్రామంలో సర్వే ప్రారంభించారు. అందుకు సంబంధించిన కార్యక్రమానికి ఎర్రగొండపాలెం మండలవ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యానశాఖ, పోలీస్‌శాఖ అధికారులతో పాటు ఇతర శాఖల సిబ్బంది టీడీపీ నాయకులు ఈ సర్వేలో ఉగాది వేడుకల కార్యక్రమానికి బయలుదేరారు.

మార్కాపురంలో క్షుద్రపూజల కలకలం

మార్కాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక దసరా మండపం సమీపంలో ఉగాది పర్వదినం రోజున క్షుద్రపూజలు జరిగాయని కలకలం రేగింది. స్థానికుల సమాచారం మేర కు స్థానిక దసరా మండపానికి సమీపంలో చెరువువద్ద చిల్లచెట్ల మధ్యలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కొబ్బరి కాయలతో పూజలు జరిగినట్లు అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు గుర్తించారు. విషయం ఆ నోట ఈ నోట 8, 9 వార్డుల పరిధిలోని అందరికీ తెలిసింది. ఎవరో అమవాస్య రోజున క్షుద్రపూజలు నిర్వహించి ఉం టారని స్థానికులు భావిస్తున్నారు. ఈ విషయమై టౌన్ పోలీసులు తమ దృష్టికి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అన్నారు.

కంభం అర్బన్ కాలనీలో..

కంభం : కంభం అర్బన్‌కాలనీలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నివాసగృహాల మధ్య ముగ్గు వేసి పసుపు, కుంకుమ పెట్టి నిమ్మకాయలు, మధ్యలో గుడ్డతో చేసిన బొమ్మ ఉంచారు. దీన్ని చూసిన చుట్టుపక్కల గృహాల వారు క్షుద్రపూజలు చేశారనే అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై కంభం పట్టణంలో అలజడి నెలకొంది. శనివారం అమావాస్య కావడంతో ఆరోగ్యం బాగాలేని వారికి దిష్టితీసి ఉంటారని పలువురు భావిస్తున్నారు. ఏదిఏమైనా ఆ ముగ్గు ఎవరు ఎందుకు వేశారో తెలియక ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుకుంటున్నారు.

సంప్రదాయబద్ధంగా ఉగాది

- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పురోహితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విశ్వావసు నామసంవత్సర ఉగాది మహోత్సవాలు ఆదివారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రజలు ఇళ్ల వద్ద మామిడి ఆకులు కట్టి షడ్రుచుల ఉగాది పచ్చడి తయారు చేసి ఇరుగు పొరుగుకు పంచారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పంచాగ శ్రవణం నిర్వహించారు. దేశకాలమాన పరిస్థితులు, రాశుల ప్రకారం ఆదాయ, వ్యయాలు వివరించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్నప్పటికీ, దేశం సుభిక్షంగానే ఉంటుందన్నారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పెదమస్తానమ్మ ఆలయంలో...


విశేష అలంకరణలో పెద్దమస్తానమ్మ

మార్కాపురం రూరల్: మండలంలోని జమ్మనపల్లి గ్రామం వద్ద వెలసిన ముద్దసానమ్మ ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెదమస్తానమ్మ అమ్మవారి మూలవిరాట్‌ను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన, అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు శాస్త్రోత్తంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి భక్తితో తీసుకు వచ్చిన పట్టువస్త్రాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల, గ్రామాల నుంచి మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించారు. కాయాకర్పూరం కానుకలు సమర్పించుకున్నారు. మార్కా పురం పట్టణ ఎస్‌ఐ సైదుబాబు దంపతులు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, యువకులు, మహిళా భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బొడిచెర్ల వీరాంజనేయస్వామి ఆలయంలో..

మండలంలోని బొడిచెర్ల గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ప్రత్యేక అహాషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహిళలతో కోలాటం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లోని ప్రజలు ఆదివారం విశ్వవసు నామ ఉగాది పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉగాది పండుగతో ప్రారంభమయ్యే తెలుగు సంవత్సరాది సందర్భంగా తాము చేసే వృత్తికి, ఆర్థిక స్థిరత్వానికి, కుటుంబసభ్యులందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని పూజలు చేశారు. పండుగ సందర్భంగా వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు భక్తులతో రద్దీగా మారింది. సాయంత్రం 5 గంటలకు గుండెపూడి శ్రీనివాసశర్మతో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

పంచాంగ శ్రవణం

గిద్దలూరు : మండల ప్రజలు ఆదివారం ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు తమఇళ్లలో పూజలు చేసుకుని పొలాల్లో ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆయా రాశుల వారికి నక్షత్రాలను బట్టి ఆదాయ, వ్యయాలను పురోహితులు చెప్పారు. దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మల పెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పాత బద్వేల్ రోడ్డులోని రామాలయంలో వసంత నవరాత్రుల కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. తొలిరోజు స్వామి వారికి విశేష పూజలు చేశారు. భక్తులు కుంకుమార్చన, విష్ణుసహస్రనామ పారాయణంలో పాల్గొన్నారు. అలాగే పంచాంగ శ్రవణం నిర్వహించి ఉగాది పచ్చడి అందించారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది


పంచాంగ శ్రవణం చేస్తున్న పవన్‌ప్రసాద్‌శర్మ

తర్లుపాడు : మండలంలో ఉగాది పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రజలు నిర్వహించారు. ప్రతి ఇంటా స్వామివార్లకు పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం రైతులు ఏరువాక కార్యక్రవన్ని నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఓరుగంటి పవన్‌ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్ రావు, ప్రజలు పాల్గొన్నారు.

సాయిమందిరంలో ఉగాది వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్ : నెహ్రూ బజార్‌లోని షిరిడీ సాయి మందిరంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. పట్టణానికి చెందిన పలురంగాల్లో ప్రముఖులైన 15 మందికి విశిష్ట సేవాపురస్కారాలు ఇచ్చి సత్కరించారు. డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, కాలంరాజు రామకృష్ణ, కృష్ణమూర్తి, రజినీకుమార్, చిత్తారి రంగనాయకులు, పురాణం సుబ్రహ్మణ్యం, మద్దెల సుబ్బారావు, ఎం.నాగ మల్లికార్జునరావు, గుంటక సుబ్బారెడ్డి, నారాయణం తులసి, సీఐ సుబ్బారావు, ఆర్కేజే నరసింహరావు, పీవీ కృష్ణారావు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎస్‌వీ రమణ, తాలుకా ఎన్‌జీవో సంఘం అధ్యక్షులు శ్రీనివాసశాస్త్రీ, సాయిమందిర అధ్యక్ష, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు పాల్గొన్నారు.


కనకదుర్గను సన్మానిస్తున్న మహిళలు


మార్కాపురంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితులు

పెద్దదోర్నాల : మండలంలో ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగువారు పంచాంగం ప్రకారం క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ విశ్వావసు నామంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి వెళ్లారు. ఈ ఏడాదైనా సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లేలా దీవించాలని మ్రొక్కుకున్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు


టీడీపీ కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్ : విశ్వవసునామ సంత్సరం ఉగాది పండుగ అందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఆర్థికాభివృద్ధి ఉండాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పండితులు పంచాంగశ్రవణం చేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఉగాది నూతన సంవత్సరానికి అంకురార్పణ చేసి కొత్త ఆశయాలు, లక్ష్యాలు సాధించే దిశగా ప్రతిఒక్కరికి స్ఫూర్తినిచ్చే పర్వదినమన్నారు. ఈ సంవత్సరం రైతులకు సకాలంలో వర్షాలు కురిసి మంచి దిగుబడి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు


గాంధీబొమ్మ కూడలిలో ఉగాది వేడుకలు

పుల్లలచెరువు : నూతన తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకొని మండలంలోని అన్నిగ్రామాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం మండల కేంద్రమైన పుల్లలచెరువులోని గాంధీబొమ్మ కూడలిలో విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా పంచాంగశ్రవణ పురాణం వేదపండితులు వినిపించారు. గ్రామాల్లోని రైతులు వేకువ జామునే పొలాలకు వెళ్లి ఏరువాక సాగారు. ఎడ్లకు నేలతల్లికి మొక్కుకున్నారు. మండలంలోని శివాలయాలు,కోమరోలు నరసింహాస్వామి, ఆంజనేయస్వామి , లక్ష్మీతిరుపతమ్మ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది

ఎర్రగొండపాలెం: మండలంలో విశ్వావసునామ సంవత్సర ఉగాది పండుగను మండల ప్రజలు ఆదివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. రైతులు ఎద్దులను, ఆవులను పసుపు కుంకుమలు చల్లి పూజలు చేశారు. గ్రామాల్లో రైతులు అరక ఎద్దులతో ఏర్వాక సాగారు. సంవృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు పండాలని, గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో రైతులు పూజలు నిర్వహించారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ఉగాది పండుగ సందర్భంగా ఎర్రగొండపాలెం మండలంవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం తెల్లవారుజాము నుంచి భక్తులు స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్థానిక శివాలయంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డైరీని, క్యాలెండర్‌ను పలువురు ఆవిష్కరించారు.

సెలవుపై తహసీల్దార్

- పొదిలిలో స్తంభించిన కార్యకలాపాలు



పొదిలి తహసీల్దార్ కార్యాలయం

పొదిలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నడికూడలిలోని పొదిలి మండలానికి వారం రోజులుగా తహసీల్దార్ లేకపోవడంతో రెవెన్యూ కార్యాకలాపాలు స్తంభించాయి. వివిధ పనులకోసం ప్రజలు కార్యాలయం చుట్టూ నిత్యం కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి వారం రోజుల క్రితం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆ తరువాత కార్యాలయాన్ని పట్టించుకున్నావారు లేరు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా..? లేదా..? వ్యక్తిగత అవసరాలు ఉన్నాయా..? అనే చర్చ పట్టణంలో జరుగుతోంది. ఇటీవల కాలంలో పట్టణంలో భూఆక్రమణలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో తహసీల్దార్ సెలవుపై వెళ్లడంతో పట్టణ ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తహసీల్దార్ లేకపోవడంతో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, భూసంబంధ సమస్య ల కోసం వచ్చే రైతులు, వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నా రు. ఆదాయ ధ్రువీకరణ, కులం, ఈడబ్ల్యూఎస్ తదితర పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అవి మంజూరు కావడం లేదు. వీఆర్వో, ఆర్‌ఐల సంతకాలు పూర్తయ్యి తహసీల్దార్ లేక పోవ డంతో అవి కట్టలుగా తహసీల్దార్ టెబుల్‌పై దర్శనమిస్తున్నాయి. దీంతో తమ ధ్రువీకరణ పత్రాలు ఏమయ్యాయో తెలీక విద్యార్థులు నిత్యం కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. కీలకమైన మండలం కావడంతో శాంతిభద్రతల సమస్యను సైతం పర్యావేక్షించాల్సిన మెజిస్టీరియల్ అధికారాలు ఉన్న తహసీల్దార్ లేకపోవడం ఇబ్బందికరంగా ఉంది. 32 రెవెన్యూ గ్రామాలు కలిగిన అతి పెద్ద మండలానికి రెవెన్యూ అధికారి సెలవు పై వెళ్లినప్పటికీ పూర్తిస్థాయి రెవెన్యూ బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. తహసీల్దార్ లేక పోవడంతో క్షేత్రస్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ కూడా కొరవడింది. దీంతో క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది ఆటవిడుపుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో తహసీల్దార్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా మైదానం


ప్రార్థనలకు సిద్ధమైన ఈద్గా

పొదిలి, మార్చి30 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ సందర్భంగా పొదిలిలోని ఈద్గా మైదానం ముస్తాబయ్యింది. ఆదివారం సాయంత్రం నెలవంక కనిపిం చడంతో సోమవారం పండుగ నిర్వహించ నున్నట్లు మత పెద్దలు తెలిపారు. ఈద్గాలో ప్రార్థనలు చేసేందుకు వీలుగా ప్రాంగణం అంతా షామియానాలు ఏర్పాటు చేశారు. నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు పర్యవేక్షణలో పంచాయతీ కార్మికులు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని పెద్దలు తెలిపారు. పొదిలి పట్టణంలోని వేలాది మంది ముస్లింలు ఈద్గా ప్రాంగణంలో జరిగే ప్రార్థనలకు తరలిరానున్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని మసీదులన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముగిసిన పోలేరమ్మ జాతర


విశేష అలంకరణలో పోలేరమ్మ, దర్శనానికి వచ్చిన భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణం లోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఉగాది ముందు అమ్మవారికి నిర్వహించే 5 వారాల జాతర ఆదివారం ముగిసింది. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉగాది సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. పొగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగులపుట్టలో పాలు పోసి నాగశిలలకు పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, పోలే రమ్మ ఉత్సవ కమిటీ నాయకులు దొడ్డా రవికుమార్, రామాంజనేయులు, మట్టం శ్రీనివాసులు, వన్నెబోయిన బ్రహ్మం, గుమ్మా అంకయ్య, శ్రీనివాసులరెడ్డిల ఆధ్వ ర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


రంగనాయకస్వామి మూలవిరాట్

రంగనాయకుని దర్శించుకున్న భక్తులు

కంభం : ఉగాది పర్వదినం సందర్భంగా కంభం శీలంవీధిలోని శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయానికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు భారీగా వచ్చారు. ఏటా ఉగాది పర్వదినం రోజున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చేందుకు కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల నుంచి భక్తులు తరలిరావడం ఆనవాయితీ.

బ్రాహ్మణ సేవాసంఘ కార్యవర్గం ఎంపిక


శ్రీధరసాయి సుబ్బారావు, పవన్ కుమార్‌శర్మ

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణానికి చెందిన శ్రీధరసాయి సుబ్బారావు, దేవులపల్లి పవన్‌కుమార్‌శర్మలు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య పదవులకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ శ్రీధర్‌సాయి సుబ్బారావును యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. పవన్‌కుమార్ శర్మను పురోహిత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.

సత్సంగ సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు


పేదలకు కుండలు, పాదరక్షలు అందిస్తున్న సత్సంగ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్‌లోని షిరిడీ సాయిసత్సంగ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయిమందిరంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు కుండలు, గొడుగులు, పాదరక్షలు, దుస్తులు అందజేశారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏటా నిర్వహించే చలివేంద్రాన్ని ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ నరసింహులు ప్రారంభించారు.

అత్తరు, టోపీలకు గిరాకీ


టోపీలను కొనుగోలు చేస్తున్న ముస్లింలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌మాసాన్ని పురస్కరించుకుని అత్తరు, టోపీల కొనుగోలు పెరిగింది. గొర్లగడ్డకు చెందిన పఠాన్ జుబేర్ ఖాన్ షాపు వద్ద ఆదివారం టోపీలు, అత్తరు కొనుగోలు చేసేందుకు ముస్లింలు పెద్దసంఖ్యలో వచ్చారు. ఈద్ నమాజ్ కోసం వివిధ జానీమాజ్‌లు, టోపీలు, అత్తర్లు, ఆధ్యాత్మిక గ్రంథాలు కొనుగోలు చేశారు.

ఈద్ నమాజ్‌కు సర్వం సిద్ధం

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షల అనంతరం సోమవారం నిర్వహించే రంజాన్ పండుగకు సంబంధించి ఈద్గాలను సిద్ధం చేశారు. ఈద్గాల వద్ద చలువ పందిళ్లు వేశారు. కంభం రోడ్డులోని పెద్దఈద్గాలో 9:30గంటలకు ఈద్‌నమాజ్ నిర్వహిస్తారని జామియామసీద్ ముతవల్లి మిర్జా సబ్దర్ అలీబేగ్ తెలిపారు. నాగులవరం ఈద్గాలో 10గంటలకు తర్లుపాడు రోడ్డులోని ఈద్గాలో 10గంటలకు ఈద్ నమాజ్ నిర్వహిస్తున్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధిగాంచిన తూర్పుగంగవరం పంచాయతీ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగమ్మ తల్లిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోర్కెలను తీర్చే తల్లిగా పూజిస్తూ నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు గంగమ్మను దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఉగాది పండుగ కావటంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చక పూజారి ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌పీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ కొలుపులు

దర్శి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండివెలిగండ్లలో ఆదివారం అంకమ్మ దేవత కొలుపులను ఘనంగా నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. కొలుపులు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పామూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకట్టకిందపల్లి ఎస్సీ కాలనీలో విద్యుత్ మోటారు మరమ్మతులకు గురవడంతో ప్రజల నీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి టీడీపీ నాయకుడు పాలపర్తి వెంకటేశ్వర్లు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతి కార్యదర్శి ఎం. మహేష్‌ను ఆదేశించారు. ఈక్రమంలో వార్డు మెంబర్ ఎస్.కృష్ణయ్య పర్యవేక్షణలో పంచాయతీ నిధులతో కొత్త డీప్‌బోరును ఏర్పాటుచేసి నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టారు.

బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి ఆసరా

పామూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వైద్య అవసరాల కోసం బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సీఎంఆర్ఎఫ్ ఎంతో ఆసరాగా ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. గుండె ఆపరేషన్‌కు సాయం కోసం పట్టణానికి చెందిన దేవకి నవనీతం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని సంప్రదించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.లక్షా 46 వేల బ్యాంకు చెక్కును మంజూరుచేయించారు. ఆ చెక్కును స్థానిక టీడీపీ కార్యాలయంలో బాధితురాలు కుమారుడు ప్రవీణ్‌కు పార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆదివారం అంద జేశారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అమీర్‌బాబు, పందిటి హరీష్, సోమిశెట్టి శ్రీనివాసులు, మొగులూరి మధు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

పీసీపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లిలో ఆదివారం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి రాజు మాట్లాడుతూ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామస్థుల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కోటయ్య మాదిగ, సుధీర్ మాదిగ, రోజేశ్ మాదిగ, హనూక్, యోహాను, ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు అన్నిఏర్పాట్లు

- చకచకా సాగుతున్న పనులు
- పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పీసీపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళాయపల్లి పంచాయతీ దివాకరపల్లి గ్రామ సమీపంలో ఏప్రిల్ 2న జరగనున్న రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకుసంబంధించిన పనులు చకచకా సాగుతున్నాయి. భూమిపూజ అనంతరం బహిరంగసభ నిర్వహిస్తుండడంతో అందుకు అవసరమైన సభా వేదికను ఏర్పాటుచేస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి భూమిపూజ జరిగే ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపూజ నాడు జరిగే బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధింత అధికారులను ఆదేశించారు.


అధికారులు, రిలయన్స్ ప్రతినిధులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సభావేదికను పరిశీలించిన ఆయన వీఐపీలు, ప్రజలు, మీడియా తదితరుల కోసం ఏర్పాటు చేస్తున్న గ్యాలరీలను సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. వీఐపీల వాహనాలు పార్కింగ్ చేసే స్థలంతో పాటు హెలిప్యాడ్‌ల వద్ద బారికేడ్లను ఏర్పాటుచేయాలని సీఐ ఖాజావలిని ఆదేశించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజల వాహనాలకు సభాస్థలికి దక్షిణం వైపున పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

ఎమ్మెల్యే వెంట వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, బత్తిన రాధాక్రిష్ణ, రిలయన్స్ ప్రతినిధి ఫణీందర్, గడ్డం బాలసుబ్బయ్య, నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి, యారవ శ్రీనివాసులు, పువ్వాడి వెంకటేశ్వర్లు, బొల్లా నరసింహారావు, క్రిష్ణారెడ్డి, కుందూరి తిరుపతిరెడ్డి, తాటికొండ వెంకటేశ్వర్లు, యడవల్లి శ్రీనివారెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పలుచోట్ల పంచాంగ శ్రవణాలు

దర్శి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉగాది పర్వదిన వేడుకలను ఆదివారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. దర్శి పట్టణంలో ప్రజలు రామాలయం, వెంకటేశ్వరస్వామి తదితర ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. ఆలయాల వద్ద పూజారులు అందించిన ఉగాది పచ్చడి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. పండితులు పంచాంగ శ్రవణం ద్వారా జరగబోయే విశేషాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉగాది రోజున పొలాలకు వెళ్లి పనులు ప్రారంభించారు.

దొనకొండలో..

దొనకొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఉగాది పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పర్యవేక్షణలో సకల దేవతలను అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టి మహనైవేద్యం సమర్పించారు. ఆశ్రమ ప్రధాన అర్చకులు మణిబాబుశర్మ పంచాగ శ్రవణం చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని అందించారు. ఆరవల్లిపాడు గ్రామానికి చెందిన బండారి మధుస్వామి భక్తులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

కురిచేడులో..

కురిచేడు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సర నూతన తెలుగు సంవత్సరాది వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాలలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రముఖ ప్రవచన కారుడు, పుస్తక రచయిత యలమందల కోటేశ్వర శర్మ ఉగాది శ్రవణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ కోటేశ్వరశర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నారాయణం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. వాపారస్తులు ఉగాది పర్వదినం సందర్భంగా లక్ష్మీ దేవికి పూజలు చేసి నూతన దస్త్రాలను ప్రారంభించారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు దేవాలయాల్లో ఉగాది పండుగను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు పంచాంగాన్ని చదివి విన్పించారు. పెదఉల్లగల్లులోని వెంకటేశ్వర స్వామి దేవాలయం భక్తులతో పోటెత్తింది. పసుపుగల్లులోని శ్రీకాశీ విశ్వేశ్వర అన్నపూర్ణా దేవి ఆలయం, మారెళ్లలోని చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానం, ఈదరలోని శ్రీరాజ మల్లేశ్వరి దేవస్థానంతో పాటు మండలంలో ఉన్న పలు అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం గ్రామాల్లో ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.


ముండ్లమూరు: పెదఉల్లగల్లు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలి

సీఎస్‌పురం(పామూరు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కాల నిర్ణయాన్ని అనుసరిస్తూ జీవిస్తూ ఉండేవారికి ఈ ఏడాది అంతా మంచే జరుగుతుందని కురిమేటి బాల సుబ్రమణ్యశాస్త్రి తెలిపారు. సీఎస్‌పురం మండలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో శ్రీవిశ్వవసునామ ఉగాది తెలుగు సంవత్సరం వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి మూల విరాట్‌కు అర్చకులు కుంకమార్చన, విశేషపూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి మహానైవేద్యాన్ని మేళతాళా లతో ఆలయ ప్రదక్షిణలు చేసి సమర్పించారు. గోశాలలో ని గోవులకు పసుపు కుంకుమాలతో ప్రత్యేక పూజలు ని ర్వహించారు. హారతి ఇచ్చి నైవేద్యాన్ని భక్తులకు పంచి పెట్టారు. అనంతరం భక్తుల కు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు.


పామూరు: గోవుకు హారతి ఇస్తున్న అర్చకులు

సాయంత్రం దేవస్థాన ఆవరణలో ఉగాది పండుగ సందర్భంగా పామూరుకు చెందిన కురిమేటి సుబ్రమణ్యం శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. ఈఏడాది ప్రజలు సుఖ శాంతులతో పాడి పంటలతో సంతోషకరంగా ఉంటారని తెలిపారు. ఆదాయం, ఖర్చులను సమతులం పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమాల్లో దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్నఆదినారామణ, ఈవో నరసింహబాబు, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


తాళ్లూరు: ప్రత్యేక అలంకరణలో అవదూత వెంకట్రామయ్య స్వామి

పీసీపల్లిలో..

పీసపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విశ్వావసు నామ తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని ఇరుగుపొరుగువారికి పంచిపెట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకలను మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గుంటిగంగా భవానీ, బొద్దికూరపాడు మాధవస్వామి, సోమేశ్వర స్వామి, శివరాంపురం ఆగస్తేశ్వర ఆలయం, తాళ్లూరు వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి, సోమవరప్పాడు ఆంజనేయస్వామి, లక్కవరం శివాలయం, అవదూత భగవాన్ వెంకట్రామయ్య స్వామి ఆలయాల్లో ఉగాది పండుగ వేడకులు ఘనంగా జరిగాయి.

పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. తాళ్లూరులోని అవధూత వెంకట్రామయ్య స్వామి తిరునాళ్ల ఆదివారం ప్రారంభమైంది. ఉదయం నుంచే భక్తులు అధికసంఖ్యలో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పేదరికంలేని సమాజమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఇందులోభాగంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్(పీ4) కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఆదివారం ఈకార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభించారన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద పీ4 సదస్సు వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో పేద కుటుంబం కూడా బంగారు కుటుంబంలా తయారుకావాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు అమలుచేస్తున్న కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. ప్రతిగ్రామంలో పేద, ధనిక తారతమ్యం లేకుండా సంపన్నులు పేదల ఆర్థిక పురోగతికి చేయిందించాలన్నారు. అప్పుడే ప్రతి కుటుంబం బంగారు కుటుంబంలా తయారవుతుందన్నారు. విజయవాడలో జరిగే సదస్సులో కనిగిరి నియోజకవర్గంలోని ఉపాధి కూలీలు, ఎస్‌హెచ్‌జీ మహిళలు, రైతులు, వ్యాపారులు కలసి సమిష్టిగా పాల్గొనటం గొప్ప విషయమన్నారు. సదస్సులోని అంశాలను ఆకళింపు చేసుకుని కనిగిరి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈకార్యక్రమం పేదలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, ఏడీఏ ఈవీ రమణ, తహసీల్దార్ రవిశంకర్, ఏవో జ్యోష్నాదేవి, తదితరులు పాల్గొన్నారు.


సదస్సుకు వెళుతున్న వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సచివాలయాల్లో వసతులు కరువు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సిబ్బందికి తప్పని పాట్లు

పామూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో వసతులు కరువయ్యాయి. గ్రామ స్థాయిలో ప్రభుత్వ సేవలు అందించేందుకు ప్రవేశపెట్టిన సచివాలయాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. దీంతో సిబ్బందితో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు అవస్థలు పడుతున్నారు. మండలంలో 19 గ్రామ సచివాలయాలకు పామూరు-1, వగ్గంపల్లి, బొట్లగూడూరు, కంభాలదిన్నె, నుచ్చుపొద, బలిజపాలెం, దూబగుంట గ్రామాల్లో మాత్రమే సచివాలయాలకు భవనాలు నిర్మించి ప్రారంభించారు. మిగిలిన సచివాలయాలు వివిధ నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రారంభిం చిన సచివాలయాల్లోనూ మరుగుదొడ్లు నిర్మించిన నీటి నిర్వహణ సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. సిబ్బందితో పాటు పనుల మీద వచ్చే అర్జీదారులు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.


నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ఒక్కో సచివాలయం నిర్వహణకు కనీసం నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చులు ఉంటాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ సచివాలయాలు ఏర్పాటుకాగా, మొదటి ఏడాది తూతూ మంత్రంగానే నిర్వహణ నిధులు విడుదలచేశారు. ఆతర్వాత గత ప్రభుత్వం వాటి నిర్వహణ భారాన్ని పంచాయతీలపై మోపింది. దీంతో పలుచోట్ల పంచాయతీ పాలకులు నిర్వహణ భారాన్ని భరించలేమంటూ చేతులెత్తేశారు.

సచివాయాల సమీపంలో రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌క్లీనిక్‌లను కూడా ఏర్పాటుచేశారు. సచివాలయంలో ఏ సేవలు చేయాలన్నా తగిన రుసుంలు చెల్లించాల్సిందే. వివిధ పథకాల దరఖాస్తు ఫారాలను సేవల పోర్టర్ నుంచి డౌన్‌లోడ్ చేసి లబ్ధిదారులకు ఉద్యోగులు ఇవ్వాలి. ఇందుకు సంబంధించి తెల్ల కాగితాలు ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదు. పామూరు లాంటి ప్రాంతాల్లో జనాభా ఎక్కువగా ఉంటుంది. అందుకుగాను నెలకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అదనపు ఖర్చు వస్తుందని సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సచివాలయ నిర్మాణ పనులను పూర్తిచేయడానికి నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, ప్రారంభించి ఉన్న సచివాలయాల్లో కనీససౌకర్యాలు ఏర్పాటుచేసి నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.


పామూరు గ్రామ సచివాలయము

సౌకర్యాలు లేక అవస్థలు

- పి.ప్రభాకర్, సీపీఐ మండల కార్యదర్శి, పామూరు



పని నిమిత్తం గ్రామ సచివాలయాలకు వెళితే కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మహిళల అవస్థలు అన్నీఇన్నీకావు. పాలకులు స్పందించి సచివాలయాల్లో వసతులు కల్పించాలి.

నేడు రంజాన్ వేడుకలు


విద్యుత్ దీపాల అలంకరణలో మసీదు

పామూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో నెలవంక ఆదివారం రాత్రి దర్శనం ఇవ్వడంతో సోమవారం రంజాన్ పండుగ జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఈసందర్భంగా ఈద్గా మైదానంలోని ఈద్గా గోడలకు రంగులు వేయించి సామూహిక ప్రార్థనలకు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 2న నెలవంక దర్శనంతో ఉపవాసాలు ప్రారంభించారు. నెల రోజుల అనంతరం ఆదివారం రాత్రి ఆకాశంలో నెలవంక దర్శనం ఇవ్వడముతో రోజాలు (ఉపవాసాలు) పూర్తయ్యాయి. సోమవారమే రంజాన్ పండుగ జరుపుకోవాలంటూ మైకుల ద్వారా ప్రచారం చేయించారు. దాంతో పండుగకు కావల్సిన సామగ్రి కొనుగోలుతో ముస్లింలు బిజీబిజీగా ఉన్నారు. వేసవికాలంలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని స్థానిక సీఎస్‌పురం రోడ్డులో ఉండే ఈద్గా మైదానంలో నిర్వహించే సామూహిక ప్రార్థనలను సోమవారం ఉదయం 7 గంటలకే బయాన్ ప్రారంభించి 7.30 నిమిసాలకు నమాజ్ ప్రారంభిస్తున్నట్లు ఈద్గా కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కనిగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నూతన తెలుగు సంవత్సర ఉగాది వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బాబా ఆలయంతోపాటు, కొండపైన, దిగువ శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. గార్లపేట రోడ్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి, శంఖవరం, కొత్తూరు ఆంజనేయస్వామి ఆలయాల్లో అర్చనలు చేశారు. ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నూతనంగా ఏర్పడిన కమిటీని అభినందించారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ శంఖవరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. తొలుత చైర్మన్‌ను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో రామకృష్ణ, రామసుబ్బారెడ్డి, చమిడిశెట్టి శ్రీనివాసులునాయుడు, అరుణోదర్, రత్తమ్మ, సింగారెడ్డి, వట్టెం వెంకటేశ్వర్లు, సుధాకర్, మధుసూదన్‌లు పాల్గొన్నారు.

ఉగ్రతోనే ప్రగతి సాధ్యం

పామూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితోనే కనిగిరి నియోజకవర్గ ప్రగతి సాధ్యమవుతుందని పామూరు టీడీపీ శ్రే ణులు కొనియాడారు. పీసీపల్లి మండలం దివాకరపల్లి గ్రామంలో ఏప్రిల్ 2న జరగనున్న భూమి పూజ కార్యక్రమాలను ఆదివారం ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరెడ్డి జయరామిరెడ్డి, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా, ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఆర్ఆర్ రఫి, ఎన్.సాంబయ్య, ముబినా మౌలాలి, తుమ్మ ఆంజనేయులు, పిడుగు శ్రీనువాసులు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, వై.అస్లీం, సుభాని, ఏ.శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పార్కు

- పామూరు వాసులకు ఆహ్లాదం కరువు
- పట్టించుకోని పాలకులు



నిరుపయోగంగా ఉన్న డీవీ పార్కు

పామూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పామూరు వాసులకు ఆహ్లాదం కరువయింది. ఇక్కడ ఉన్న పార్కు అధ్వానంగా ఉంది. పామూరు పట్టణంలోని కొత్త చెరువు ప్రాంతంలో డీవీ పార్కు ఉంది. ఉన్న ఒకేఒక పార్కు అభివృద్ధి ఎవరికీ పట్టడంలేదు. పిచ్చిమొక్కలతో పచ్చదనం కోల్పోయి విషసర్పాలకు నిలయంగా మారింది. పట్టణంలో 32 వేలమంది జనాభా ఉన్నారు. 2002లో సూర్యచంద్రసేవా సంస్థ తరుపున అధ్యక్షుడు డీవీ మనోహర్ కొత్త చెరువు కట్టకు ఆనుకొని ఉన్న పంచాయతీ స్థలంలో తన తండ్రి దరిశి వీరాంజనేయులు పేరుతో పార్కును(డీవీ) ఏర్పాటుచేశారు. పచ్చని చెట్టు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయడంతో సందర్శకుల సంఖ్య అప్పట్లో గణనీయంగా ఉండేది. ఆదివారం వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఆటవిడుపుగా ఉండేది. పార్కులో జారుడు బల్లలు, ఉయ్యాల, రంగులరాట్నం, వ్యాయామ పరికరాలు, రకరకాల ఆటవస్తువులు విద్యార్థుల కోసం ఏర్పాటుచేశారు. ప్రజలు ఉదయం, సాయంత్ర పూట వాకింగ్ చేసేందుకు చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మించారు.

ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న ఆ పార్కును 2011లో గ్రామ పంచాయతీకి అప్పజెప్పారు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పార్కు రూపురేఖలు లేకుండాపోయింది. చివరికి చీకటి కార్యక్రమాలకు నిలయంగా మారింది. పార్కు ఎదురుగా ఎస్‌బీఐ బ్యాంకు, పోస్టాఫీసు, తదితర కార్యాలయాలు ఉన్నాయి. బ్యాంకు పనుల కోసం వచ్చే పొదుపు గ్రుపు మహిళలు సేద తీరేందుకు పార్కు ఎంతగానో ఉపయోగపడేది. గత వైసీపీ పాలకులు పార్కులో గ్రామ సచివాలయం నిర్మించాలనే తలంపుతో భూమిని చదును చేసి కొన్ని చెట్లను తొలగించారు. ప్రజలు వ్యతిరేకించడంతో ఆ ప్రయత్నాలను విరమించుకొన్నారు. ఇప్పటికైనా పాలకులు, పంచాయతీ అధికారులు స్పందించి డీవీ పార్కు అభివృద్ధికి నిధులు మంజూరుచేసి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థికసాయం

దొనకొండ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కాలుకు గాయమై సర్జరీ చేయించుకున్న టీడీపీ కార్యకర్తకు ఆర్థికసాయం చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాలమేరకు ఆపార్టీ మండల నాయకుడు వీరపనేని వెంకన్న చౌదరి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని వీరేపల్లి గ్రామానికి చెందిన కార్యకర్త తోటా శివప్రసాద్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలుకు గాయం కావటంతో సర్జరీ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. సమాచారం తెలుసుకున్న వెంకన్నచౌదరి ఆయన ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కామేపల్లి చెంచయ్య, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వల్లపునేని ఆదినారాయణ, బత్తుల గాలయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, విప్పర్ల శేషు, వైకే చౌదరి, పి.సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
3
సోమవారం 31 మార్చి 2025





పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్

శ్రీవిశ్వావసుకు ఘన స్వాగతం

- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- కలెక్టరేట్‌లో పంచాంగ శ్రవణం



ఉగాది వేడుకను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, వేదికపై జేసీ, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ



ఉగాది పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ జిల్లా ప్రజల జీవితాలలో వెలుగునివ్వాలని కలెక్టర్ వెంకటమురళి ఆకాంక్షించారు. ఆదివారం కలెక్టరేట్ ఎదురు ఏపీహెచ్ఆర్‌డీ సమావేశ మందిరంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదుపరి వేద పండితులు కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ కళాశాల, ఆహార విజ్ఞాన సాంకేతికకళాశాల, ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులందరికి ఆశీస్సులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం, నెలలో 4వ శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు సుమారు 400 మందికి ఉచిత భోజన వసతి కల్పించామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమానికి వచ్చే వారి కోసం కుర్చీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్ ఆవరణంలో 4 షాపులను ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. ఆ షాపులను సేంద్రియ పద్ధతి ద్వారా తయారు చేసిన కూరగాయలను,.దాన్యాలను, నేతన్నలచే నేతబడిన చీరలు, వస్త్రాలు అమ్మటానికి, ఒక ఏటీఎమ్ సెంటర్ ఏర్పాటు చేయటానికి కేటాయిస్తామన్నారు. వాటిని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా సంయుక్త కలెక్టర్ కొరకు బంగ్లా నిర్మాణానికి చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

ఆక్వా పార్క్ నిర్మాణానికి రూ.88 కోట్లు మంజూరు

దిండిలో ఆక్వాపార్క్‌నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 88 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. వాటికి పరిపాలన అనుమతులు కూడా పొందామన్నారు. త్వరలో సీఎం చంద్రబాబు నాయుడు భూమిపూజ చేసిన తర్వాత నిర్మాణాలు మొదలుపెడుతామన్నారు. ఈ ఆక్వాపార్క్‌తో ఆక్వా రైతులు వారికి కావాల్సిన సరుకు కోసం ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వెళ్ళకుండా పొందవచ్చన్నారు. . నిజాంపట్నం హార్బర్ ఫేస్-2 విస్తరణ పనులు 63 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అటవీ శాఖకు సంబంధించిన భూముల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి పరిష్కార మార్గం చూపామన్నారు. జిల్లాలో ఉన్న కృష్ణానది కుడి కాల్వ గట్టు బలోపేతం చేయడానికి, 1540 కోట్ల రూపాయలతో డీపీఆర్ తయారు చేసి ఇచ్చామన్నారు. జిల్లాలో 1016 మంది డయాలసిస్ రోగులు ఉన్నారని తెలిపారు. వారి కోసం చీరాలలో 13 బెడ్‌లతో ఒక డయాలసిస్ కేంద్రం మాత్రమే ఉందని, జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒక డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేయమని సీఎం దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆ ప్రమాదాలు ప్రాణాంతకంగా ఉన్నాయని తెలిపారు.

వాటి కోసం రెండు ట్రామాకేర్ సెంటర్‌లు కావాలని సీఎంని కోరినట్లు దానికి స్పందించి మంజూరు చేస్తామని సీఎం తెలిపినట్లు కలెక్టర్ చెప్పారు. కుందేరు వాగు అభివృద్ధికి సంబంధించి డీపీఆర్ తయారు చేసి సీఎంకి ఇవ్వటం జరిగిందన్నారు. వాటిపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. జిల్లా ప్రజల దాహార్తిని అమృత ధార పథకంతో పూర్తి స్థాయిలో తీరుస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు.

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్రజలకు, అధికారులకు, చిన్నారులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు జిల్లా అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారన్నారు. జిల్లాని వ్యవసాయం, విద్య, ఆక్వా రంగాలలో బాగా అభివృద్ధి చెందిందని తెలిపారు. ప్రభుత్వానికి బాగా ఆదాయం తెచ్చే రంగం పర్యాటక రంగం అన్నారు. సూర్యలంక బీచ్‌కు క్లీన్ అండ్ శాండ్ బీచ్‌గా ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ స్థానాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 కింద 97 కోట్ల 52 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు. ఇది గర్వించతగ్గ విషయమన్నారు. కలెక్టర్ ప్రమేయంతో కేంద్ర ప్రభుత్వానికి పంపించాల్సిన అన్నిప్రతిపాధనలు సకాలంలో పంపటం వలన నిధులు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను అభినందించారు. జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ ధాన్యం కొనుగోలులో చూపిన చొరవ, ప్రజలలో ప్రత్యేక స్థానాన్ని పొందారన్నారు. ఇటీవల జరిగిన కలెక్టర్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ద్వారా జిల్లా ఎస్పీ అభినందనలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత,జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, ఆర్డీవో గ్లోరియా పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినీలను అభినందించారు. వివిధ రంగాలలోని ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందించారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలెక్టర్, ఎమ్మెల్యే

నేడు రంజాన్



- మసీదులు ముస్తాబు
- ప్రార్థనలకు విస్తృత ఏర్పాట్లు
- ఈద్గాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు

బాపట్ల, రేపల్లె మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ముస్లింలు అతిపవిత్రంగా భావించే రంజాన్‌పండుగను సోమవారం జరుపుకోనున్నారు. నెలవంక దర్శనంతో గత నెల 2వ తేది నుండి ప్రారంభమైన రంజాన్‌ఉపవాసదీక్షలు తిరిగి నెలవంక దర్శనంతో ముగిశాయి. సమత,మమతల సమ్మేళితాన్ని చాటిచెప్పే అతిపవిత్రమైన పండుగ రంజాన్ ఈనెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించటంతో ముస్లింలు ఈమాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. నెలరోజుల ఉపవాసాల అనంతరం రంజాన్‌పండుగను జరుపుకోనున్నారు. పండుగ సందర్భంగా బాపట్లజిల్లాలోని మసీదులు, ఈద్గాలు అందంగా ముస్తాబయ్యాయి. బాపట్ల ఇస్లాంపేట,జమేదారుపేట ఈద్గాలతోపాటు 17మసీదులలో సోమవారం రంజాన్ ప్రార్ధనలకు ఏర్పాట్లు చేశారు. రేపల్లె పట్టణంలోని జామియా పెద్ద మసీద్, మదీనా మసీద్, లక్ష్మీటాకీస్‌సెంటర్లోని మర్కస్ మసీద్, పెనుమూడి రోడ్ లోని మదీనా మసీద్ విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్ముతున్నాయి.



రేపల్లె : విద్యుత్ దీపాలతో అలంకరించిన జామియా పెద్ద మసీద్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చినగంజాం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెం గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీన జరిగే పేదల సేవలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్, టీడీపీ కార్యకర్తల సమావేశం, ప్రజావేదిక ప్రాంతాలను, రామాలయం, పార్కింగ్ స్థలాలను, స్టాల్స్‌ను కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం పరిశీలించారు. సీఎం చేతుల మీదగా వితంతు పింఛన్ పొందే బత్తుల జాలమ్మ, దివ్యాంగ పింఛన్ పొందే వడ్లమూడి సుభాషిణి గృహాలకు వెళ్లి వారితో మాట్లాడారు. సుభాషిణి ఇంటికి రంగులు ఎందుకు వేస్తున్నారని ఎంపీడీవో శ్రీనివాసమూర్తిని ప్రశ్నించారు. ఇంటికి నూతనంగా రంగులు వేయొద్దని, ఇల్లు ఎలా ఉందో అలాగే ఉంచండి అని తహసీల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. కార్యకర్తల సమావేశానికి 500 మందికి మించి పాసులు ఇవ్వరాదని ఆర్డీవో టీ.చంద్రశేఖర్ సూచించారు. పింఛన్ లబ్ధిదారులకు గృహ నిర్మాణ పథకం కింద గృహాలు మంజూరు చేయాలని హౌసింగ్ పీడీకి సూచించారు. అనంతరం అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, జిల్లా రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మాధవనాయుడు, చీరాల డీఎస్పీ మొయిన్, పలు శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



పింఛన్ లబ్ధిదారు తల్లితో మాట్లాడుతున్న కలెక్టర్

రంజాన్ వేడుకలకు భద్రతా చర్యలు

● ఎస్పీ తుషార్ డూడి



బాపట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణంలో ముస్లింలు రంజాన్ వేడుక జరుపుకునేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉపవాసదీక్షలు ముగించుకొని సోమవారం ఈద్‌ఉల్‌ఫితర్ జరుపుకునేందుకు సిద్ధమౌతున్న ముస్లింలకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుక జరుపుకోవాలని ఆకాంక్షించారు. సోషల్‌మీడియాపై నిఘా ఉంచామన్నారు. ఎవరైనా కుల, మత వైషమ్యాలను రెచ్చగొట్టే విధంగా వదంతలు వ్యాప్తి చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిఘా కోసం సీసీ కెమెరాలు, డ్రోన్‌లను వినియోగించనున్నామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. అందరి జీవితాలలో రంజాన్ వెలుగులు నింపాలని సుఖసంతోషాలతో జీవించాలని ఎస్పీ కోరారు.



పేదరిక నిర్మూలనకు..

ఉక్కు సంకల్పం

- పీ-4పై సర్వత్రా సానుకూల స్పందన
- విజయవంతమైన సభ
- దిశానిర్దేశం చేసిన చంద్రబాబు
- మార్గదర్శకులకు సూచనలు...
- బంగారు కుటుంబాలకు భరోసా
- రెండు కుటుంబాలతో సీఎం ముఖాముఖి



మాట్లాడుతున్న కురగల్లుకు చెందిన కడియం నరహరి కుటుంబ సభ్యులు

మంగళగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ ఆంధ్ర - 2047 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న ఆశయాన్ని చేరుకుంటామని పీ-4 సభ ప్రతిజ్ఞ పూనింది. సున్నా పేదరికం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం వెలగపూడి సచివాలయం వద్ద ఆదివారం సాయంత్రం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన పీ-4 సభ విజయవంతమైంది. తొలుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ఆరంభించారు. ఆ తరువాత పీ-4 పథకానికి సంబంధించిన లోగోను చంద్రబాబు పవన్‌కళ్యాణ్‌తో కలిసి సంయుక్తంగా ఆవిష్కరించారు. అటు తరువాత పీ-4 తాలూకు రాష్ట్రప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌ను కూడ చంద్రబాబు రిమోట్‌తో ఆరంభించారు. ఈ సందర్భంగా మార్గదర్శకులుగా ముగ్గురు దిగ్గజ వ్యాపారవేత్తలను, మంగళగిరి, విజయవాడకు చెందిన రెండు పేద కుటుంబాలవారిని బంగారు కుటుంబాలుగా ఎంచుకుని వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పేదరికం నిర్మూలన లక్ష్యంగా ఇక్కడ తాము ఉక్కు సంకల్పాన్ని తీసుకుంటున్నామని ప్రకటించారు. నా మిత్రుడు పవన్‌కళ్యాణ్, ప్రధాని మోదీ ముగ్గురం కలిసి ఈ లక్ష్యాన్ని సాధించి తీరుతామని ఉద్వేగంగా అన్నారు. రాష్ట్రంలో సున్నా పేదరికం లక్ష్యంగా తనకున్న నిర్దిష్టమైన ఆలోచనలను ఈ వేదిక సాక్షిగా ప్రజలముందర పెడుతున్నానని చెప్పారు.

● ఈ కార్యక్రమానికి బంగారు కుటుంబాలుగా ఎంచుకున్నవారిలో మొదట మంగళగిరి పాత రూరల్ మండలం కురగల్లుకు చెందిన కడియం నరసింహ, వెంకట సుశీల దంపతులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారితో నేరుగా సంభాషిస్తూ కుటుంబ స్థితిగతులను గురించి విచారించారు. ముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు నరసింహ సమాధానమిస్తూ తాను గొర్రెలు కాచుకుని జీవనం సాగిస్తున్నట్టు తెలిపాడు. తనకు భార్య, ఇద్దరు పిల్లలు, వృద్ధులైన తల్లీదండ్రులు ఉన్నారన్నారు. పదవ తరగతి చదువుతున్న తన కుమారుడ్ని సివిల్ ఇంజనీరుగా చూడాలన్న కోరిక తనకు బలంగా ఉందన్నారు. కుమార్తె ఎనిమిదవ తరగతి చదువుతుందన్నారు. నెలకు ఎంత సంపాదిస్తావంటూ సీఎం అడుగగా...తనకు నెలనెలా జీతం రాదని, మూడు మాసాలకు ఓసారి పెంచిన గొర్రెలలో ఒకదానిని అమ్మి రూ 20 వేల వరకు సంపాదిస్తానని తెలిపారు. భార్య వెంకట సుశీల పూల తోటలలో పూలు కోస్తూ రోజుకు రూ వందనుంచి రెండొందల వరకు సంపాదిస్తుందని చెప్పారు. తనకు మెరుగైన ఉపాధికి సాయమందించడంతోపాటు తన బిడ్డలను చదివించాలని నరసింహ అభ్యర్థించాడు. ఈ సందర్భంగా చంద్రబాబు సూచనల మేరకు మార్గదర్శి గ్రీన్‌గో కంపెనీ యజమాని చలమలశెట్టి అనిల్‌కుమార్ స్పందిస్తూ ఆ కుటుంబానికి తాను అండగా వుంటానని హమీనిచ్చారు. ఇది తనకో గొప్ప అవకాశమని గతంలో సీఎస్‌ఆర్ కింద కొన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ...తనకు సంతృప్తి కలగలేదన్నారు. పీ-4 పేరుతో ఏర్పాటుచేసిన ఈ ప్లాట్‌ఫారం చాల గొప్పదిగా తాను భావిస్తున్నట్టు చెప్పారు.

> చంద్రబాబు మాట్లాడుతూ పీ-4లో తొలిదశగా 30 లక్షల కుటుంబాల వారిని ఆర్థికంగా సామాజికంగా పైకి తీసుకురావాలన్నారు. మార్గదర్శకులు డబ్బులు ఇవ్వడమొక్కటే లక్ష్యంగా పెట్టుకోకుండా తాము బాధ్యత తీసుకున్న కుటుంబాలకు మంచి గైడెన్స్ కూడ ఇవ్వాలన్నారు. వారివారి ఆదాయ పెంపుకు తగిన సలహాలు, సూచనలతోపాటు తగిన అవకాశాలను కూడ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా తాను చిన్నతనంలో ఏడు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకునే వాడినని, వచ్చిన అవకాశాలను ఉపయోగించుకుంటూ తాను ఈ స్థాయికి వచ్చానని చెప్పారు. అలాగే పేదలకు సాయమందించే విషయంలో ప్రభుత్వాలు ముందుండి పనిచేసినా వారి ఎదుగుదలకు చాల సమయం పడుతుందన్నారు. నిజానికి ఒక జనరేషన్ మిస్ అయ్యేంత సమయం పడుతుందన్నారు. అందుకే తాను బాగా ఆలోచించి పేదరికం నిర్మూలనకు ఈ పీ-4 పధకానికి రూపకల్పన చేశానని చెప్పారు.

● విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 57వ డివిజన్ నుంచి వచ్చిన మరో బంగారు కుటుంబం తాలూకు యజమాని మత్యా ఇమ్మానుయేల్, శారణ్ దంపతులు మాట్లాడుతూ తమ కుటుంబ దీనగాధను సభ ముందుంచారు. ఇమ్మానుయేల్ రాడ్ బెండింగ్ వృత్తిలో వుంటూ కుటుంబపోషణ చేస్తున్నట్టు తెలిపాడు. ఈ కుటుంబ వ్యధ ఆసక్తిగా అనిపించడంతో చంద్రబాబు వారితో ఎక్కువసేపు మాట్లాడారు. ఈ దంపతులకు ఇద్దరు సంతానం వున్నారు. కుమార్తె అలేఖ్య ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసి చదువుతుండగా...కుమారుడు గని ప్రకాష్ పదవ తరగతి వరకు చదివి ప్రస్తుతం తనకు తోడు రాడ్ బెండింగ్ పనికి వస్తున్నట్టు తండ్రి ఇమ్మానుయేల్ వివరించాడు. కుమారుడ్ని ఎందుకు చదివించడం లేదని చంద్రబాబు అడుగగా...తనకు వచ్చే రూ 700లు కుటుంబ పోషణకు సరిపోనందున కుమారుడ్ని చదువు ఆపించి తనతోపాటు కూలీపనికి తీసుకువెడుతున్నట్టు చెప్పాడు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందని అడుగగా కుమార్తె అలేఖ్యను మెడిసన్ చేయించాలన్న పట్టుదలతో తమ కుటుంబమంతా కలిసి ఆలోచించుకుని ఈ నిర్ణయం తీసుకుందని భార్యాభర్తలు సమాధానమిచ్చారు. కొడుకును చదివించలేక పోతున్నామన్న బాధ నీకు లేదా? అంటూ సీఎం చంద్రబాబు శారణ్‌ను ప్రశ్నించగా ఆమె కళ్లనీళ్లు పెట్టుకున్నారు. మీ తండ్రి మీ అక్కను చదివిస్తూ నిన్ను కూలీపనికి పంపించడం నీకేమీ కోపాన్ని తెప్పించలేదా అంటూ చంద్రబాబు ప్రకాష్‌ను ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని తన తండ్రికి సాయం చేస్తున్నానన్న తృప్తి తనకు వుందన్నారు. అలాగే తమ కుటుంబంనుంచి అక్కను డాక్టర్‌ను చేయాలన్న పట్టుదల తమందరికీ ఉందంటూ ప్రకాష్ చెప్పాడు. ఆ వెంటనే నీవు బైపీసి ఎందుకు తీసుకున్నావని చంద్రబాబు అలేఖ్యను అడుగగా తనకు డాక్టర్ కావాలనే కోరిక బలంగా ఉందన్నారు. డాక్టరే కావాలని ఎందుకనుకుంటున్నావని అడుగ్గా తమ పేద కుటుంబాల వారికి ఉచితంగా వైద్యసాయం అందించాలన్న లక్ష్యంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నానని అలేఖ్య చంద్రబాబుకు వివరించింది. దీంతో చంద్రబాబు ఆమెను అభినందిస్తూ పేదలలో పుట్టినంత మాత్రాన మంచి ఆశయాలు వుండకూడదన్న రూలేమీ లేదన్నారు. అనంతరం మార్గదర్శిగా జైరాజ్ స్టీల్ కంపెనీ యజమాని సజ్జన కుమార్ గోయంకా స్పందిస్తూ అలేఖ్యను తాను మెడిసన్ చదివించగలనని హమీనిచ్చారు.

● మరో మార్గదర్శి మేఘా ఇంజనీరింగ్ కంపెనీ యజమాని పీవి కృష్ణారెడ్డి మాట్లాడుతూ డిసెంబరు 14న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పీ-4 పధకాన్ని గురించి తొలుత ప్రకటించారన్నారు. ఇది కచ్చితంగా ఓ గేమ్ ఛేంజర్‌గా నిలబడుతుందన్నారు. పేదరికాన్ని నిర్మూలించాలన్న కాంక్ష సీఎం చంద్రబాబులో చాల బలంగా ఉందన్నారు. చంద్రబాబు సూచనతో తాను కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలాన్ని దత్తత తీసుకుని దాని సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని చెప్పారు. తాను వ్యాపారపరంగా 20 దేశాలు, 20 రాష్ట్రాలలో తిరుగుతుంటానని...కానీ ఈ ప్రభుత్వం మాదిరి ప్రజలకు ఏదో మేలు చేయాలన్న తపన ఎక్కడా ఇంత బలంగా కనిపించలేదని చెప్పారు. ఈ సభా కార్యక్రమానికి ప్రముఖ టీవీ యాంకర్ ఝాన్సీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



కురగల్లుకు చెందిన కడియం నరహరి కుటుంబ సభ్యులతో ఒకే టేబుల్ వద్ద కూర్చుని ముచ్చటిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎం



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, వేదికపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

వైభవంగా దాసయ్యస్వామి ఆరాధనోత్సవం

చినగంజాం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తూర్పుపల్లెపాలెం గ్రామంలో దాసయ్యస్వామి 17వ వార్షిక ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆరాధన మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని దర్గాలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పెద్దపల్లెపాలెం గ్రామ కాపు దండుప్రోలు తిరుమలరావు ఇంటి వద్ద నుంచి తూర్పుపల్లెపాలెం గ్రామం వరకు దాసయ్యస్వామి వారి జెండా ఊరేగింపు కనక తప్పెట్లు, బాణసంచాలతో, భక్తుల కోలాహలంతో నిర్వహించారు. రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహాయ సహకారంతో భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు టీడీపీ నాయకులు రాములు తెలిపారు. దాసయ్యస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రథమ వార్షికోత్సవం

మేదరమెట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బొడ్డువానిపాలెంలో శ్రీ అభయాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేషాభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వలపర్లలో ఆక్రమణలు తొలిగేదెప్పుడు?

- నిత్యం ట్రాఫిక్ సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


వలపర్లలో ఇరుకుమయంగా రథంబజార్

మార్టూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోనే వలపర్ల గ్రామ పంచాయతీకి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. మంచి వస్త్ర వ్యాపారానికీ, బంగారు నగల తయారీకి, చేనేత మగ్గాల కుటుంబాలకు నిలయమైన వలపర్ల గ్రామానికి ఎంతో గుర్తింపు ఉంది. దానికి తోడు రాజకీయపరంగా గ్రామపంచాయతీ, అసెంబ్లీ ఎన్నికలలో వలపర్ల గ్రామం వైపు అన్ని రాజకీయ పార్టీనాయకులు ప్రత్యేక దృష్టి పెడుతుంటారు. గ్రామంలోని ఓటర్లు సుమారు 9 వేలు కాగా, జనాభా మాత్రం 12 నుంచి 15 వేల వరకు ఉంటారు. అయితే ఇన్ని ప్రత్యేకతలు ఉన్న వలపర్ల గ్రామంలో ఎంతో కాలం నుంచి ప్రధాన సెంటరు పూర్తిగా ఆక్రమణలకు గురైంది. ముఖ్యంగా ప్రధాన సెంటర్‌లో ఎన్‌టీఆర్ బొమ్మ నుంచి స్టేట్‌బ్యాంక్ ముందుగా సినిమా హాలు సెంటరు వరకు రోడ్డుకు ఇరువైపులా కొన్నిచోట్ల పంచాయతీకి చెందిన స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఇక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ బొమ్మ వరకు వచ్చే రోడ్డులో రథం బజారు రద్దీలో హైదరాబాదులోని చార్మినార్ సెంటర్‌ను తలపిస్తుంటుంది. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలతో ఇరుకుగా తయారైంది. ఒక వాహనం రథం బజారులోకి అడుగుపెడితే రెండో వాహనం వెళ్లాలంటే కష్టమే. అద్దంకి నుంచి చిలకలూరిపేట వైపు, చిలకలూరిపేటనుండి అద్దంకి వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ట్రాఫిక్‌తో పాటు ఆక్రమణలు పుణ్యాన ప్రధాన సెంటర్‌లో టర్నింగ్ తీసుకోవడానికి డ్రైవర్లు నానా ఇబ్బందులు పడుతుంటారు.ఈ సెంటరులో సెంటు స్థలం ధర ఆకాశంలో ఉంటుంది. అందుకని ఆక్రమణలకు గురైన స్థలాలను వదులుకోవడానికి ఆక్రమణదారులు ఇష్టపడరు.

ఆక్రమణలను తొలగించాలంటే పిల్లిమెడలో గంట కట్టేదెవరు

వలపర్ల సెంటర్‌లో పెరిగిన ఆక్రమణలు కారణంగా ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు, దాదాపుగా అందరూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు అందరూ అంగీకరిస్తారు. అదేవిధంగా ఆక్రమణలను తొలగించాలని కోరుకుంటారు గ్రామ పార్టీనాయకులు కూడా ఆక్రమణలను తొలగించాలని పై స్థాయి ఉన్నత నాయకులకు చెప్తుంటారు. కానీ పిల్లి మెడలో గంట కట్టేదెవరు? వలపర్ల సెంటర్‌లో ఆక్రమణలను తొలగించడానికి పూనుకునేదెవరు అనే ప్రశ్న అందరి మదిలో మెదులుతూనే ఉంది. ఈ ఆక్రమణలు తొలగింపు అనే కందిరీగ తుట్టెను కదిపితే తమ పార్టీ ఓట్లు బ్యాంక్‌కు తూట్లు పడతాయని రాజకీయ పార్టీనాయకులు కూడా సైలెంట్‌గా ఉంటున్నారు. సాఫీగా జరుగుతున్న వలపర్ల గ్రామంలో తొలగింపు ఆక్రమణలు అలజడికి మేమెందుకు కారణమవ్వాలని నాయకులు కూడా చూస్తూ ఉన్నారు. గత కొన్నేళ్ల నుంచి గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొనిఉంది. ఏళ్ల తరబడి గ్రామ పంచాయతీ సర్పంచ్‌లుగా ఎవరు అధికారంలోకి వచ్చినా, పంచాయతీ అధికారులుగా ఎవరు ఉన్నా అక్రమణల తొలగింపుపై సాహసం చేయలేకపోయారు. కానీ ఎప్పటికైనా సెంటర్‌లో ఆక్రమణలను తొలగించాల్సిన పరిస్థితి ఉంది. మరి ఈ విషయమై గ్రామంలోని ఇరుపార్టీల నాయకులనుగానీ, గ్రామ పెద్దలుగానీ, ప్రజా ప్రతినిధులను గాని కదిపితే మాత్రం పిల్లి మెడలో గంట కట్టేదెవరంటూ గుంభనంగా నవ్వుతూ వెళ్లిపోతారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

43 మందికి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కుటుంబ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 43 మందికి మంజూరైన రూ.22 లక్షల 82వేల304 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ 9 నెలలు కాలంలో నియోజకవర్గంలో 320 మందికి సుమారు 3 న్నర కోట్లకు పైగా రూపాయలను సీఎం సహాయనిధి నుంచి బాధతుల వైద్య ఖర్చుల కోసం పంపిణీ చేశామన్నారు. పేద కుటుంబాలు అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం వారు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం సహాయనిధి ద్వారా సాయం అందిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం నిధులు మంజూరు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు అందించే వైద్య సేవలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. మార్టూరు, పర్చూరు ప్రభుత్వ ఆస్పత్రులలో ఓపీల సంఖ్య పెరుగుతుందంటే అందుకు కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యం పట్ల తీసుకుంటున్న చర్యలేనన్నారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, కోటపాటి సురేష్, నాయుడు హనుమంతరావు, కంభంపాటి హనుమంతరావు పాల్గొన్నారు.

స్థల వివాదంలో కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

గవినివారిపాలెం(చీరాల), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్థలం వివాదంలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌పై పలువురు తీవ్రంగా కత్తితో దాడిచేసి గాయ పరిచారు. ఈ ఘటన ఆదివారం మండల పరిధిలోని గవినివారిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ చీదరబోయిన నాగేశ్వరరావుకు, చీదరబోయిన భరత్, వీరయ్య, లక్ష్మీనారాయణకు మధ్య స్థల వివాదాలు ఉన్నాయి. నాగేశ్వరరావు నాయనమ్మ రాములమ్మ తన స్థలంలో ఇంటి నిర్మాణం నిమిత్తం బేస్‌మట్టం చేయించుకుంటుంది. దీనికి సంబంధించి హద్దు విషయంలో రాములమ్మతో ముగ్గురు వాదనకు దిగారు. విషయం తెలుసుకుని చేరుకున్న కానిస్టేబుల్ నాగేశ్వరరావు వారిని నిలదీశారు. దీంతో వివాదం జరిగి ముగ్గురితో పాటు మరి కొందరు కలిసి కత్తితో దాడి చేయగా నాగేశ్వరరావు శరీరంపై గాయాలయ్యాయి. అతడిని ఏరియా వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ హాస్పిటల్‌కు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

ఇంకొల్లు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు బస్టాండ్‌లో విశ్వ హిందూ పరిషత్ వారు ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రయాణికుల సౌకర్యార్థం మే ఆఖరు వరకూ మంచినీరు, మజ్జిగను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రామూర్తి, బ్రహ్మం, రమేష్, హనుమంతరావు, శ్రీను, ప్రభావతి, అనంతరామయ్య, సుబ్బారావు, మోహనకృష్ణ పాల్గొన్నారు.


బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న ఇటుక బట్టీ కార్మికుడిని మోటార్ సైకిల్ ఢీకొనడంతో తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కూలీలు అద్దంకి సమీపంలోని కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీలలో పనిచేస్తున్నారు. ఆదివారం కలవకూరు రోడ్డులో ఇటుక బట్టీల వద్ద రోడ్డు మార్జిన్‌లో నలుగురు కూలీలు నడిచి వెళ్తుండగా ఎస్.ఎర్రయ్యను అద్దంకి నుంచి కలవకూరు వైపు వెళ్తున్న మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎర్రయ్యను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

జడ్పీటీసీని పరామర్శించిన బూచేపల్లి

కారంచేడు (పర్చూరు), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు జడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజని అనారోగ్యానికి గురికావడంతో ఆదివారం ప్రకాశం జిల్లా జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆమె కుమారుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ పరామర్శించారు. రజని ఇంటికి వెళ్లిన వారు ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారివెంట వైసీపీ ఇన్‌చార్జి గాదే మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

క్రైస్తవుల నిరసన ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న క్రిస్టియన్లు

చీరాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ సువార్తికులు పగడాల ప్రవీణ్ మృతికి సంబంధించి పట్టణంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున నిరసన క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ గడియార స్తంభానికి చేరుకుని మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మత బోధకులు, క్రైస్తవులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పర్చూరు : పాస్టర్ పగడాల మృతిపై పారదర్శకంగా విచారణ జరగాలని పలువురు పాస్టర్స్ డిమాండ్ చేశారు. సెయింట్ థారస్ లూథరన్ పరిశుద్ధ చర్చి ఆధ్వర్యంలోని ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు.


సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న అద్దంకి శ్రీరామచంద్రమూర్తి, చీరాల సాహితీ వేత్త రాధాకృష్ణ

పుట్టంరాజుకు ఉగాది పురస్కారం

అద్దంకిటౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం వివిధ రంగాలలో ప్రతిభ చూపిన పలువురికి ఉగాది పండుగ సందర్భంగా పురస్కారాలను అందించింది. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన వేడుకలలో అద్దంకికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం, సాహితీవేత్త పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి ఉగాది పురస్కారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అందజేశారు. కార్యక్రమంలో టూరిజం మంత్రి కందుల దుర్గేష్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురస్కారాన్ని అందుకున్న పుట్టంరాజుకు అద్దంకికి చెందిన సాహితీవేత్త వారణాసి రఘురామశర్మ, ఈఈ మస్తాన్‌రావు, బీవీ కృష్ణారెడ్డి, చిన్ని మురళీకృష్ణ, గాడేపల్లి దివాకర్‌దత్తు, చప్పిడి వీరయ్య, పోలిరెడ్డితో పాటు సాహితీ ప్రముఖులు పుట్టంరాజును అభినందనలు తెలియజేశారు.

రాధాకృష్ణకు అవార్డు

చీరాల : చీరాలకు చెందిన ప్రముఖ సాహితీవేత్త వడలి రాధాకృష్ణ ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అభినందన సభలో సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. స్థానిక ప్రముఖులు వడలి సాహితీ రంగానికి అందిస్తున్న సేవలను కొనియాడారు.

శింగరకొండ పూజారికి ..

అద్దంకి : ఉగాది పండుగను పురస్కరించుకొని జిల్లా స్థాయిలో బాపట్లలో దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉగాది పురస్కార ప్రదానోత్సవంలో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ పూజారి శ్రీరామచంద్రమూర్తి కలెక్టర్ వెంకటమురళి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం శింగరకొండలో శ్రీరామచంద్రమూర్తిని ఈవో తిమ్మానాయుడు, పూజారులు అభినందించారు.

అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

బల్లికురవ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియెగ దారులందరూ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50శాతం రాయితీని సద్వినియెగం చేసుకోవాలని బల్లికురవ మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. కిలో వాట్ లోడుకు రెండు వేలు చెల్లించాల్సి ఉందని ఇప్పుడు రాయితీ ప్రకారం రూ.1000 చెల్లిస్తే సరిపోతుందని వినియెగదారులందరూ ఈ అవకాశాన్ని వినియెగంచుకోవాలన్నారు. జూన్ వరకు గడువు ఉందని పాత విద్యుత్ కనెక్షన్లు వాడుకుంటున్న వారు వెంటనే అదనపు లోడుకు రాయితీ నగదు చెల్లించాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు గ్రామాలలో ఉన్న విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

శాకాహారంతో ఆరోగ్యం

చీరాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సిద్ధంగా లభించే శాకాహారంతో అందరూ ఆరోగ్యంగా జీవించాలని జన విజ్ఞాన వేదిక చీరాల డివిజన్ ప్రతినిధులు అన్నారు. ఉగాది పండుగను పురస్కరించకుని కేజీఎం ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఉగాది పచ్చడి విలువను తెలియజేశారు. కవులు శాస్త్రీయ పద్ధతులు, జీవన మనుగడ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కవులు చిరంజీవి, వెంకట్, కృష్ణమోహన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరావు, నిర్వాహకులు రామారావు, జయరాజ్, శ్రీను, వెంకటేశ్వర్లు, హేమంత్, సూరిబాబు, వెలుగొండారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.7.72కోట్లు మంజూరు

అద్దంకి,మార్చి30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరు చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తారు రోడ్ల నిర్మాణానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 7.72 కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. తిమ్మనపాలెం నుంచి ఎర్రబాలెంకు 1.20 కోట్ల రూపాయలు, బండివారిపాలెం నుంచి మిన్నెకల్లు కు 3 కోట్ల రూపాయలు, సంతమాగులూరు నుండి నె హ్రూ నగర్ కు 1.50 కోట్ల రూపాయలు, జాతీయ రహదారి నుండి పి.గుడిపాడుకు 80 లక్షలు, జాతీయ రహదారి నుంచి కుర్రావానిపాలెంకు 17 లక్షల రూపాయలు, ముప్పవరం నుంచి కొండమూరు 45 లక్షల రూపాయలు, పి.గుడిపాడు నుంచి అలవలపాడుకు రూ.60లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

ముస్లింలకు మంత్రి గొట్టిపాటి రంజాన్ శుభాకాంక్షలు

ముస్లింలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ అందరి జీవితాలలో సుఖసంతోషాలు తీసుకురావాలన్నారు. రంజాన్ త్యాగానికి, సేవానిరతికి మారుపేరన్నారు. అల్లాహో ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

అద్దంకి, మార్చి30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా అద్దంకి విద్యుత్ డివిజన్ పరిధిలోని అన్ని విద్యుత్ చెల్లింపు కేంద్రాలు సోమవారం తెరిచి ఉంటాయని ఈఈ నల్లూరి మస్తాన్‌రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు.

ఘనంగా ఉగాది వేడుకలు


పొదుపు సంఘాల మహిళలకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


పంచాంగ శ్రవణం చేస్తున్న ప్రముఖ వేద పండితులు మాచిరాజు

చీరాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం పరిధిలో ఆదివారం ఉగాది పర్వదినం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్నారు. అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ రుణ సాయంతో అభివృద్ధి

ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణ సాయంతో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. పీఎంఎఫ్ఎంఈ ద్వారా మంజూరైన రూ.13లక్షల చెక్కులను రుణ గ్రహీతలకు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఈపథకం ద్వారా ఉపాధి కోసం రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు బ్యాంకులు సాయం అందిస్తున్నట్లు వివరించారు. అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు మధు, అంజిబాబు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

అద్దంకి : తెలుగు సంవత్సరాది ఉగాదిని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇళ్లల్లో ప్రత్యేక పూజలు చేసుకొని దేవాలయాలకు వెళ్లి స్వామి వార్లను దర్శించుకున్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలలో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లో విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం విన్పించారు. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో చీరాల ప్రిన్సిపల్ జూనియర్ న్యాయాధికారి రిహానా కుటుంబసభ్యులతో పూజలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా డ్వామా పీడీ జోసఫ్ కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు. జానపద కళాపీఠం ఆధ్వర్యంలో జనశిక్షణ సంస్థ డైరెక్టర్ శ్యాంసునీల్‌కు ఉగాది పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్డీడీ డాక్టర్ దేవపాలన, జ్యోతిచం ద్రమౌళి పాల్గొన్నారు.

చినగంజాం : తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను అన్ని గ్రామాల్లో ఆదివారం ఘనం గా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళిత ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. పంచాగ శ్రవణాన్ని వేద పండితులు చదవి వినిపించారు. ఒకరినొకరు తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఏఎల్ లక్ష్మీనరసింహాచార్యులు, యాజ్ఞిక స్వాములు పరాశరం రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు శత అష్టోత్తర కలశ స్థాపన తిరువంజనం కార్యక్రమాన్ని నిర్వహించి, 108 కలిశాలతో స్వామికి అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. రాత్రికి స్వామి వారిని విశేషంగా అలంకరించి ఊంజల్ సేవ జరిపారు. తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. మండలంలోని సంతరావూరు, చినగం జాం, గొనసపూడి, కడవకుదురు, రాజుబంగారుపాలెం, చింతగుంపల్లి, పెదగంజాం, నీలాయిపాలెం తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో పంచాగ శ్రవణం ని ర్వహించారు.

పర్చూరు : ఉగాది పండుగను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీ తివిక్రమ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీకంచి బొట్ల శ్రీనివాసశర్మ నేతృత్వంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి నాగయ్య ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రం జరిగింది.

మార్టూరు : ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లకు మామిడితోరణాలు కట్టుకొని, పూజలు చేశారు. ఘట్టేశ్వరస్వామి, పాండురంగస్వామి, ఆంజనేయస్వామి తదితర దేవస్థానాలకు వెళ్లి స్వామిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న మాచిరాజు పంచాంగ శ్రవణం

పంగులూరు : చందలూరు గ్రామంలో ఆదివారం ఉగాది పర్వదిన సందర్భంగా పంచాగ శ్రవణం జరిగింది. గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ప్రముఖ వేదపండితులు మాచిరాజు వేణుగోపాల్ పంచాంగ శ్రవణం గావించారు. పంచాంగ శ్రవణం భవిష్యత్ ద్వారాన్ని ఆవిష్కరిస్తుందని, విశ్వావసు సంవత్సరంలో గతం కంటే అందరికీ మెరుగైన ఫలితాలు ఉంటాయని మాచిరాజు తెలిపారు. మీన రాశి వారికి కొంత ఇబ్బందికరం ఉంటుందన్నారు. గతం కంటే పంటలు ఆశాజనకంగా ఉంటాయని, దిగుబడులు, ధరలు అనుకూలిస్తాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ పల్లపోతు శ్యాంసుందరం, ఈవో అంజనీదేవి, అర్చకులు రఘునాథాచార్యులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

అద్దంకి మేజర్‌లో పూడికతీత పనులు ప్రారంభం

అద్దంకి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఆయకట్టులోని అద్దంకి మేజర్ కాలువలో రూ.20లక్షలతో చేపడుతున్న పూడిక తీత పనులను డీఈ రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసరావు, ఏఈ సునిల్ పాల్గొన్నారు.

అన్నదానం

అద్దంకి, మార్చి30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పద్మేష్ సహకారంతో అన్నదానం పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి, లహరి, సుధీర్, వీరయ్య, శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి గురుస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరిని కలిసిన ఉప్పురైతులు

మార్టూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండలానికి చెందిన ఉప్పు రైతులు ఆదివారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిశారు. మండలంలో ఉప్పును సాగుచేస్తూ ఏళ్ల తరబడి ఉప్పునే జీవనాధారంగా చేసుకొని బతుకుతున్న దాదాపుగా 25 మందికి పైగా రైతులు ఏలూరిని కలిశారు. సమస్యలను ఏలూరి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా, తన పరంగా కృషి చేస్తానని ఏలూరి ఉప్పు రైతులకు భరోసా నిచ్చారు.

సీతారాముల పంచలోహ విగ్రహాల బహూకరణ


ఆలయానికి సమర్పించిన స్వామివార్ల పంచలోహ విగ్రహాలు

పర్చూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ అభయాంజనేయస్వామివార్ల దేవాలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామివార్ల పంచలోహ విగ్రహాలను ఆదివారం బహూకరించారు. తిమ్మరాజు పాలెంకు చెందిన నర్రా రామయ్య, శిరీష దంపతుల స్వామివార్ల పంచలోహ విగ్రహాలకు పూజలు చేశారు.

రామాలయానికి కొత్తసొబగులు

- ఇత్తడిలోహంతో దర్వాజా, అశ్వవాహనం ఏర్పాటు


గర్భగుడికి ఇత్తడి దర్వాజాతో అలంకరణ, కొలువుదీరిన ఇత్తడి అశ్వవాహనం

మార్టూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం మండలంలోని కోదండరామ స్వామి దేవస్థానంలో కొత్తసొబగులతో భక్తులను అలరించింది. 36 ఏళ్లుగా ఈ దేవస్థానంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్వామి వారి కల్యాణం, ఉగాదికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తాజాగా పలువురు దాతల సహకారంతో ఆలయంలో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. గర్భగుడి ముఖద్వారం దర్వాజాను సుందరంగా ఇత్తడి లోహంతో అలంకరణ చేశారు. అంతేగాకుండా ఆలయంలో స్వామి వారి కోసం ఇత్తడి లోహంతో ఏర్పాటు చేసిన అశ్వ వాహనం, సీతారామలక్ష్మణ విగ్రహాలకు మకరతోరణం, ఇంకా ఛత్రంను ఏర్పాటు చేశారు. ఉగాది పండుగ సందర్భంగా అర్చకులు నమశివాయ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

నేడు రంజాన్

వేటపాలెం(చీరాల), మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రం జాన్ వేడుకలు ఆదివా రం రాత్రి నుంచి ఉత్సాహంగా మొదల య్యాయి. సాయంత్రం సూర్యాస్త మయం అనంతరం షవ్వాల్ నెల ప్రా రం భమైంది. సోమవారం ఉదయం మసీద్‌ల వద్ద ప్రార్థనలు నిర్వహించ నున్నారు.



ఉగాది సందర్భంగా ప్రత్యేక అలంకరణలో నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారు

సంప్రదాయబద్ధంగా ఉగాది

- పలు ఆలయాల్లో వైభవంగా వేడుకలు
- గ్రామదేవతలకు ఉత్సవాలు
- పలుచోట్ల పంచాంగ పఠనం
- కోవెలలన్నీ కిటకిట
- శరవేగంగా జిల్లా అభివృద్ధి : కలెక్టర్



నగర గ్రామదేవత ఇరుగాళమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం శ్రీవిశ్వావసు నామ ఉగాది వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. సూర్యోదయానికి ముందే కాలకృతులు తీర్చుకుని, సంప్రదాయ వస్త్రాలు ధరించి, తమ ఇష్టదైవాలకు పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఉగాది పచ్చడిని స్వీకరించారు. కొత్త ఏడాదిలో తమకు భవిష్యత్ ఎలా ఉం టుందోనని తెలుసుకునేందుకు పలువురు టీవీ ఛానళ్ల ముందు కూర్చుండి పోయారు. ఆత్యధికులు ఆలయాల్లో జరిగే పంచాంగ పఠనాన్ని శ్రద్ధగా విన్నారు.ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో వాహనసేవలు జరిగాయి.



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న మాడభూషి సంపత్‌కుమార్



కళారత్న అవార్డు అందుకుంటున్న దోర్నాల హరిబాబు



ఉగాది పురస్కారం అందుకుంటున్న ఈతకోట సుబ్బారావు

పురస్కారాల ప్రదానం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఆలయంలోనూ వేద పండితులు, అర్చకులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. జేసీ కే. కార్తీక్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ-రమాదేవి దంపతులు, నగరంలోని రంగనాథస్వామి, చాకలివీధి మహాలక్ష్మి ఆలయాల్లో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ట్రంకు రోడ్డులోని శివాజీసెంటర్ లో నిర్వహించిన సింహపురి ఉగాది వేడుకల్లో విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానం పీఠాధిపతి విద్యారణ్య భారతి మహాస్వామి పాల్గొని భక్తులకు మంగళశాసనాలు అందించారు.

ఇరుగాళమ్మకు సారె

ఉగాది సందర్భంగా రంగనాథస్వామి ఆలయానికి వేదగిరి నుంచి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి తరలివచ్చి భక్తులకు దర్శనం ఇచ్చారు. తల్పగిరి రంగ నాథస్వామి ఆలయం నుంచి మేళతాళాలతో అర్చకులు ఇరుకళల పరమేశ్వరికి ఉగాది సారె అందజేశారు.

శరవేగంగా జిల్లా అభివృద్ధి : కలెక్టర్

జిల్లాలో ఈ ఏడాది సమృద్ధిగా పంటలు పండాయని, పరిశ్రమల స్థాపనతో శరవేగంగా జిల్లా అభివృద్ధి చెందు తున్నదని కలెక్టరు ఓ ఆనంద్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తిక్కన భవనంలో జరి గిన ఉగాది వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. తెలుగుదనం ఉట్టి పడేలా సంప్రదాయ దుస్తులు ధరించి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలూరి శిరోమణిశర్మ పం చాంగ శ్రవణం చేశారు.



పంచాంగ పఠనం చేస్తున్న ఆలూరి శిరోమణిశర్మ

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

ఈ సందర్భంగా 11 మంది కవులతో సమ్మేళనం నిర్వహించారు. కవులు జీ.సుభద్రాదేవి, అవ్వారు శ్రీధర్ బాబు, పెంచలనరసింహం, నరసింహమూర్తి, సుధీర్‌కుమార్, రత్నప్రసాద్, పాతూరు అన్నపూర్ణ, లక్ష్మీ మైథిలి, నరేంద్రబాబు, తోట సులోచన, అలెగ్జాండర్ తమ కవితలను గానం చేసి, కలెక్టర్ నుంచి సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఏపీఎంఐసీ పీడీ శ్రీనివాసులు దుర్యోధన ఏకపాత్రాభినయం చేశారు. అనంతరం వివిధ రంగాల ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందచేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో భద్రాచలం బాబు, ఎం.జమున, వెంకటరమణయ్య, శివయ్య, శ్యామలాదేవి, విశ్వనాథం, శ్రీనివాసకుమార్, రసూల్, ఉషాకిరణ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో అతిథులుగా నగర మేయర్ స్రవంతి, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కే. జనార్దన్‌రెడ్డి, డీఆర్‌వో ఉదయ భాస్కర్‌రావు, ఆర్డీవో అనూష, ఐ.పీఆర్ డీడీ సదారావు, జిల్లా టూరిజం అధికారి శివ నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం నుంచి పురస్కారాలు

వెంకటాచలం మండలం సరస్వతీ నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు మాడ భూషి సంపత్‌కుమార్ సాహిత్య రంగంలో అందించ సేవలకుగానూ అమరా వతిలో జరిగిన ఉగాది వేడుకల్లో సీఎం చం ద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకు న్నారు. అలాగే ప్రముఖ రచయిత, కవి ఈతకోత సుబ్బారావు, టీవీ, నాట కరంగ హాస్య నటుడు దోర్నాల హరిబాబు కూడా సీఎం నుంచి పురస్కారం అందు కున్నారు.



ఉగాది పురస్కారాలు అందుకున్న కవులతో కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్



నేడు రంజాన్

మసీదులు, ఈద్గాల వద్ద ఏర్పాట్లు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం(నేడు) రంజాన్ వేడుకలను నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలు సిద్ధం చేశారు. ఆదివారం రాత్రి నెలవంక కనిపించడంతో ముస్లింలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ నెల ప్రారంభం నుంచి ఆదివారం (ఈనెల 30) వరకు ఉపవాస దీక్షలను ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తి చేసిన సందర్భంగా అల్లాహ్‌కి కృతజ్ఞతలు తెలిపే పండుగ రంజాన్. దీన్ని ఈదుల్ ఫితర్‌గా పిలుస్తారు. సోమవారం జిల్లాలోని 444 మసీదులు, ఈద్గాలలో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు రంజాన్ ప్రార్థనలు జరుగుతాయి. దీంతో నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియనుంది. కాగా నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద రంజాన్ ప్రార్థనలకు భారీ ఏర్పాట్లు చేశారు. అలాగే నవాబుపేట, బుజబుజనెల్లూరు, జాకీర్‌హుస్సేన్ నగర్, బర్మాసెల్ గుంట, తూకుమానుమిట్ట తదితర ప్రాంతాల్లోని ఈద్గాలలో కూడా నగర పాలక సంస్థ విస్తృత ఏర్పాట్లు చేసింది. రంజాన్ సందర్భంగా అల్లాహ్ దయతో జిల్లా ప్రజలు సంతోషంగా ఉండాలని పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు అందజేశారు.



నెలవంక కనబడటంతో బాణాసంచా కాల్చి నగరంలో సంబరాలు చేసుకుంటున్న ముస్లింలు



రంజాన్ సందర్భంగా ముస్తాబైన నెల్లూరు బారా షహీద్ దర్గా ప్రాంగణం

ఏఎంసీలపై ఆశలు

- ఊపందుకున్న ఆశావహుల ప్రయత్నాలు
- అధిష్ఠానానికి వినతుల వెల్లువ
- భాగస్వామ్య పార్టీలకు పదిశాతం పదవులు
- ఈ క్రమంలో ఏ కమిటీకి ఎవరన్నది చర్చనీయాంశం

నెల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నామినేటెడ్ పదవుల్లో కీలకమైన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ)ల ఛైర్మన్ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు ఊపందుకున్నాయి. తొలుతగా సర్వేపల్లి ఏఎంసీ ఛైర్మన్‌ను నియమించడంతో జిల్లాలో మిగతా కమిటీల పదవుల కోసం నేతల ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. వీటి భర్తీ కోసం ఎమ్మెల్యేలపై స్థానిక నాయకుల ఒత్తిడి మొదలయ్యింది. దీంతో తమ నియోజకవర్గాల పరిధిలోని ఏఎంసీ పదవులను భర్తీ చేయాలని అధిష్ఠానికి విన్నవించుకుంటున్నారు. ముఖ్యమైన కమిటీలకు సంబంధించి ఇప్పటికే పలుచోట్ల ఎమ్మెల్యేలు ఓ నిర్ణయానికి వచ్చేశారు. అయితే సొంతపార్టీలోనే పలువురు ఈ పదవుల కోసం పోటీ పడుతున్న కారణంగా ఎటూ తేల్చలేక కొందరు మౌనంగా ఉండగా, మిత్రపక్షాలైన టీజేపీ, జనసేనలకు ఏ మార్కెటింగ్ కమిటీలు ఖరారు చేస్తారో తెలియని కారణంగా, తమ నియోజక వర్గాల పరిధిలోని మార్కెటింగ్ కమిటీల్లో తమ పార్టీకి ఏవి మిగులుతాయో తేలాక తుది నిర్ణయం తీసుకోవాలని ఎదురుచూస్తున్నారు.

సేన, బీజేపీలకు పది శాతం !?

మిత్రపక్షాల ఒప్పందం నేపథ్యంలో నామినేటెడ్ పదవుల్లో సైతం జనసేన, బీజేపీలకు కొన్ని సీట్లు కేటాయించాలని కూటమి పెద్దలు నిర్ణయించుకు న్నారు. ఈ క్రమంలో సాగునీటి సంఘ ఎన్నికల్లో సైతం జనసే,బీజేపీలకు పది శాతం సంఘాలను కేటాయించారు. ఇప్పుడు మార్కెటింగ్ కమిటీల్లో సైతం ఇదే నిష్పత్తిలో ఆ పార్టీలకు పది శాతం మార్కెటింగ్ కమిటీలు కేటా యించే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో కీలకమైన మార్కె టింగ్ కమిటీలను తమకు కేటాయించాలని జనసేన, బీజేపీ నాయకులు కోరే అవకాశం లేకపోలేదు. తొలుత కూటమికి చెందిన జిల్లా పెద్దలు కూర్చొని ఏ మార్కెటింగ్ కమిటీ ఏ పార్టీకి అనే విషయం ఖరారు చేసే వరకు ఆ కమిటీలకు ఛైర్మన్లు ఎవరనే విషయంలో స్పష్టత కనిపించదు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

నామినేటెడ్ పదవుల్లో కీలకమైనవిగా గుర్తింపు పొందిన ఏఎంసీలపై పలువురు నాయకులు ఎన్నికల ముందు నుంచే కన్నేసి ఉన్నారు. ఆ పోస్టు ఇస్తే పార్టీలో చేరుతామని కొందరు, ఇస్తారనే నమ్మకంతో కష్టించిన వారు ఇంకొందరు ఇలా టీడీపీలో ఓ స్థాయి కలిగిన ప్రతి నాయకుడు మార్కెట్ కమిటీపై ఆశలు పెట్టుకున్నారు.

- ఆత్మకూరు మార్కెటింగ్ సొసైటీకి ఆనం సంజీవరెడ్డి తనయుడు ఆనం మురళీరెడ్డి పేరు ప్రచారంలో ఉంది. కావలి మార్కెటింగ్ కమిటీ పమిడి రవికుమార్ చౌదరి పేరు బలంగా వినిపిస్తోంది. ఇతనికి ఎమ్మెల్యే ఆశీస్సులు ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఈ కమిటీ బీసీ మహిళకు రిజర్వు చేశారు. రిజర్వేషన్లు మార్పు చేయడానికి ప్రయత్నిస్తారా లేక పార్టీలోనే బీసీ మహిళలను ఎంచుకుంటారో అంతుపట్టకుండా ఉంది.
- కందుకూరు ఏఎంసీ ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యింది. ఈ సామాజికవర్గం నుంచి రెబ్బవరపు మాల్యాద్రి, బద్దిపూడి శిఖామణం, పులి నాగరాజు, చిడితోటి బాలకోటయ్యల సతీమణుల పేర్లు అధిష్ఠానానికి పంపినట్లు సమాచారం. అయితే పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఈ పదవి కోసం గట్టిగా పట్టుపడుతున్నట్లు సమాచారం. రిజర్వేషన్ మార్పు చేయించి ఈ పదవి తనకు ఇప్పించాలని అతను ఎమ్మెల్యేపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.
- ఉదయగిరి ఏఎంసీ ఓసీ మహిళకు రిజర్వు అయ్యింది. వింజమూరుకి చెందిన గణపం సుదర్శన్‌రెడ్డి సతీమణికి దాదాపుగా ఈ పదవి ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది.

ఇలా జిల్లా పరిధిలోని చిన్నాపెద్ద తేడా లేకుండా అన్ని ఏఎంసీలకు ఆశావహులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. సర్వేపల్లి ఏఎంసీ నియామకం జరగడంతో ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా అన్ని ఏఎంసీల కమిటీల కోసం ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. పల్లెలు,పట్టణాలు తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో ఏఎంసీ ఛైర్మన్లు ఎవరు..? ఏ ఏఎంసీ ఏ పార్టీకి అనే అంశంపై జోరుగా చర్చ సాగుతోంది. మరోవైపు ఈ పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి.

రేపటి నుంచి
కళాశాలల పునః ప్రారంభం

- ఇంటర్‌లో మారిన సిలబస్
- నమూనా ప్రశ్నపత్రం విడుదల
- జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా మార్పులు

నెల్లూరు(విద్య), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, ఈ ఏడాది నుంచి అమలుకు శ్రీకారం చుట్టింది. నీట్, జేఈఈ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా సిలబస్‌లో మార్పులు చేసింది. ఈ మేరకు 2025-26 విద్యాసంవత్సరానికి చెందిన సిలబస్, ప్రశ్నపత్రాల కూర్పు, అకడమిక్ క్యాలెండర్‌ను ఇంటర్‌బోర్డు విడుదల చేసింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ 1 (రేపటి) నుంచి తరగతులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసింది. అంతేకాక 314 రోజులకుగాను 235 పనిదినాలు, 79 సెలవులను కూడా ప్రకటించింది.

షెడ్యూల్ ఇలా...

జూనియర్ కళాశాలలు ఇప్పటి వరకు ప్రతి ఏటా జూన్ మొదటి వారం నుంచి ప్రారంభిస్తుండగా, ఈ విద్యాసంవ త్సరం మాత్రం ఏప్రిల్ ఒకటి (మంగళవారం) నుంచే ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ ఒకటి వరకు సెలవులు ఇవ్వనున్నారు. జూన్ 2న కళాశాలలు ప్రారంభించి జూలై 17 నుంచి 19 వరకు యూనిట్-1 పరీక్షలు నిర్వహిం చనున్నారు. ఆగస్టు 18 నుంచి 20 వరకు యూనిట్-2 పరీక్షలు, సెప్టెం బరు 15 నుంచి వరకు క్వార్టర్లీ పరీక్షలు నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. అలాగే సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5వరకు దసరా సెలవులు, అక్టోబరు 22 నుంచి 24 వరకు యూనిట్-3 పరీక్షలు, నవంబరు 17 నుంచి 22 వరకు అర్ధ సంవత్సరం పరీక్షలు, జనవరి 15 నుంచి 20వరకు ప్రీఫైనల్-1 పరీక్షలుంటాయి. ఇకపోతే 2026 జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు, జనవరి 21 నుంచి 28 వరకు ప్రీఫైనల్-2, ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్, ఫిబ్రవరి చివరివారం నుంచి మార్చిలో థియరీ పరీక్షలు నిర్వహించి మార్చి 18న అకడమిక్ సంవత్సరాన్ని ముగించేలా షెడ్యూల్ ప్రకటించారు.

అమల్లోకి కొత్త సిలబస్

2012-13లో రూపొందించిన ప్రథమ సంవత్సరం సైన్స్, 2014-15లో ఆర్ట్స్, 2018-19లో లాంగ్వేజ్ సిలబస్‌ను ఈ ఏడాది నుంచి మార్పు చేశారు. 2025-26లో ప్రథమ సంవత్సరానికి కొత్త సిలబస్‌ను రూపొందించారు. ద్వితీయ సంవత్సరం సిలబస్‌ను వచ్చే ఏడాది నుంచి మార్చనున్నారు. ప్రథమ, ద్వితీయభాషలతో పాటు ప్రస్తుతం ఉన్న నాలుగు సబ్జెక్టుల సైన్స్ ఐదు సబ్జెక్టుల ఆర్ట్స్ విభాగాలను ప్రక్షాళన చేశారు. అలాగే ప్రథమభాషగా ఇంగ్లి‌ష్‌ను అందరికీ వర్తింపచేస్తుండగా, ద్వితీయభాష కోసం ప్రస్తుతం ఉన్న పది భాషల స్థానంలో అదనంగా సైన్స్, ఆర్ట్స్ గ్రూపుల్లో మరో 14 సబ్జెక్టులను ప్రతిపాదించి, ఎంపిక చేసుకునే అవకాశం విద్యార్థికి కల్పించారు. అలాగే గ్రూపు సబ్జెక్టుల విషయానికి వస్తే ఎంపీసీ గ్రూపు విద్యార్థులు అదనంగా బయాలజీని, బైపీసీ వారు అదనంగా మ్యాథ్స్‌ను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. దీని ద్వారా ఎంబైపీసీ చదువుకుని జేఈఈ, నీట్ పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది.

ప్రశ్నపత్రాల్లోనూ మార్పు

ఈ ఏడాది నుంచి ప్రశ్నపత్రాల కూర్పులోనూ మార్పులు చేశారు. మ్యాథ్స్-ఏ, బీలుగా ఉన్న రెండు పేపర్లను కలిపి ఒకే పేపర్‌గా, బోటనీ, జువాలజీలను కలిపి బయాలజీ పేపర్‌గా మార్చారు. వీటితోపాటు అదనపు సబ్జెక్టుల విధానాన్ని ప్రవేశపెడుతుం డడంతో ఆయా సబ్జెక్టులలోని మార్కులను పునర్విభజన చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2, 4, 8 మార్కుల విధానాన్ని కొనసాగిస్తూనే ప్రతి సబ్జెక్టులో దాదాపు 10శాతం ఒక్కమార్కుల ప్రశ్నలు ఉండేలా ప్రశ్నపత్రాన్ని రూపొందించనున్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు మధ్యనున్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. అలాగే గతంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉన్న ఏడు పీరియడ్ల విధానానికి స్వస్తి పలికారు. ఇక నుంచి అన్ని జూనియర్ కళాశాలల్లో కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 8 పీరియడ్లు ఉండేలా మార్పు చేశారు.

ఇంటర్ విద్యలో సంస్కరణలు



సంస్కరణలకు అనుగుణంగా ఇంటర్ కళాశాలలు నిర్వహించేలా అన్నీ చర్యలు తీసుకుంటున్నాం. 2020 జాతీయ విద్యావిధానం, 2023 జాతీయ పాఠ్య ప్రణాళికా చట్టాలను అనుసంధానం చేస్తూ ప్రజా స్పందనలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కోరుకున్న సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడం, అనవసర విషయాలను తగ్గించుకోవడం, విద్యార్థులను ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఇంటర్ కళాశాలలు ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభం కానున్నాయి.

- డాక్టర్ ఏ.శ్రీనివాసులు, ఆర్ఐవో

ఇక సాఫీగా ప్రయాణం !

- ఉమ్మడి జిల్లాలో 13 ప్రధాన రోడ్ల బాగుకు నిధులు
- 95.31 కి.మీ మేర రహదారులపై పూడనున్న గుంతలు
- ప్యాచ్ వర్కులకు రూ.34.35 కోట్ల మంజూరు
- మూడు నెలల్లో పూర్తి చేసేలా ప్రణాళిక

నెల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గుంతల రోడ్లతో అవస్థలు పడుతున్న జిల్లా ప్రజల కష్టాలు తీరనున్నాయి. ప్రధాన రోడ్లపై గుంతలు కనిపించ కూడదని ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఆ క్రమంలో గుంతలు పూడ్చేందుకు భారీగా నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే సుమారు రూ.20 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చడం, రోడ్లపక్కన చెట్లను తొలగించే ప్రక్రియ జరుగుతోంది.ఇప్పటికే చాలా వరకూ రహదారులపై గుంతలు పూడ్చారు. ఇప్పుడు మరికొన్ని ప్రధాన రోడ్లను కూడా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో జిల్లా ప్రధాన రహదారులతో పాటు రాష్ట్ర రహదారులు కూడా ఉన్నాయి. మొత్తం 13 రోడ్లపై 95.31 కిలోమీటర్ల మేర ఉన్న గుంతలకు ప్యాచ్‌లు వేసేందుకు నిర్ణయించారు. ఇందుకు గానూ రూ.34.35 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 536 కిలోమీటర్ల దూరం ఎండీఆర్(జిల్లా ప్రధాన రహదారులు) రోడ్లను బాగు చేసేందుకు రూ.200 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు జారీ చేయగా, అందులో ఆర్‌అండ్‌బీ నెల్లూరు సర్కిల్‌లో 30.62 కి.మీ బాగు చేసేందుకు రూ.10.55 కోట్లు మంజూరయ్యాయి. అలానే రాష్ట్రవ్యాప్తంగా 890 కి.మీ రాష్ట్ర రహదారులు(ఎస్‌హెచ్) బాగు చేసేందుకు రూ.400 కోట్లు మంజూరు చేయగా, అందులో ఉమ్మడి జిల్లాకు 64.69 కి.మీ బాగు చేసేందుకు రూ.23.80 కోట్లు కేటాయించారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ సెక్రటరీ కాంతీలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ప్రధాన కనెక్టివిటీ రోడ్లు తాజా జాబితాలో ఉన్నాయి. రానున్న నెలరోజుల్లో టెండర్లు పిలిచేలా ఆర్‌అండ్‌బీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. టెండర్లు పూర్తయిన మూడు నెలల్లోపు పనులు పూర్తి అయ్యేలా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వం కూడా రానున్న వర్షాకాలంలోపు ఎక్కడా కూడా రోడ్లపై గుంతలు కనిపించ కూడదని ఆదేశించింది. మూడు, నాలుగేళ్ల నుంచి ఆగిపోయి ఉన్న ఎన్‌డీబీ రోడ్ల పనులు కూడా ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి
కావలి
కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు
సోమవారం, 31 మార్చి 2025
www.andhrajyothy.com

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	140
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	280
కోడిగుడ్ల ధర (100)	470

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8611
వెండి కిలో ధర	రూ. 103200
వెండి ఒక గ్రాము	రూ.106.20

కళారత్న అవార్డు అందుకున్న మాధవరావు

కావలి, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉగాదిని పురస్కరించుకుని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళారత్న హంస అవార్డుకు కావలి పుల్లారెడ్డి నగర్‌కు చెందిన వేములపాటి మాధవరావు (మెజీషియన్) ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నుంచి ఆవార్డును అందుకున్నారు. మాధవరావు నాబార్డు, పలు బ్యాంకుల సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాలలో గిరిజనప్రాంతాలు, లంబాడీతండాలలో ఆర్థిక అక్షరాస్యత, జలసంరక్షణలపై 3వేలకు పైన ప్రదర్శనలు ఇచ్చారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డును ప్రదానం చేసింది.

వైభవంగా ఉగాది సంబరం



కలిగిరి : భక్తులను విశేషంగా ఆకట్టుకున్న స్వామివారి ప్రత్యేక రూపం

కందుకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సంబరాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన



ఆత్మకూరు : శేషారెడ్డిని సత్కరించి జ్ఞాపికను బహూకరిస్తున్న సభ్యులు

కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి వేదపండితులు ఆశీర్వచనాలు జరిగాయి. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నార్నే రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహం, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేద వృద్ధులు, చిన్నారులకు నూతన వస్త్రాలు, స్వీట్లు, పండ్లు, భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, చక్కా కేశవరావు, రవ్వా అరుణ, ఆర్.సాయిలక్ష్మి, ఇన్నమూరి శ్రీనివాసులు, గుర్రం చిన్న అల్లూరయ్య, కోట వెంకటకిషోర్ పాల్గొన్నారు. అలాగే కుటుంబ సమేతంగా గృహాలలో పాలపొంగళ్లు పెట్టుకుని ప్రత్యేక పూజలు నిర్వహించటంతోపాటు షడ్రుచుల ఉగాది పచ్చడిని సేవించారు. మహిళలు ప్రత్యేకంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని విజయ కాంప్లెక్స్ వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. దుకాణాల యజమానులు స్వీట్లు పంపిణీ చేశారు.



ఉదయగిరి : గండిపాళెం గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

● **ఉగాది సంబరాల్లో ఎమ్మెల్యే మాలకొండయ్య**

వలేటివారిపాలెం : మండలంలోని అంకభూపాలపురంలో ఉన్న తన మేనమామ ప్రెగడ పుల్లయ్యతో పాటు ఆయన కుటుంబసభ్యులతో కలిసి చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఉగాది సంబరాల్లో పాల్గొన్నారు. పెద్దలకు పొంగళ్లు, దుస్తులు పెట్టుకొని పండుగను జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగాది పండుగ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ప్రెగడ శ్రీనివాసులు, ప్రెగడ నరసింహారావు, కుంబాల అంజయ్య, పిన్నిక క్రిష్ణయ్య, చెంచు శ్రీనివాసులు, కొండారెడ్డి, పంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అలాగే మండలంలో మహిళలు తెల్లవారు జామునే ఇళ్లవద్ద రంగవల్లులు తీర్చిదిద్ది తెలుగు నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అంకమ్మ, పోలేరమ్మ, గంగమ్మ, భ్రమరాంబికా దేవి, ఆంజనేయస్వామి, శివాలయం తదితర దేవాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

● కావలిరూరల్ : మండలంలోని గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు తెల్లవారు జాము నుంచే గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనంతో తయారు చేసిన ఉగాది పచ్చడి సేవించారు. మండలంలోని ముందరపొట్టిమ్మ ఆలయంతో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు.



కొండాపురం : భీమవరప్పాడు ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

● బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలు స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు, పూజాసామగ్రిని గరుడసేవ సత్రం నుంచి మేళతాళాలతో ఆలయానికి తీసుకొచ్చి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, గ్రామ పెద్దలు నాటారు వెంకటరమణయ్య, సుధాకర్ పాల్గొన్నారు. తాళ్లూరు విశ్వనాథరావుపేట పంచాయతీల నడుమ అటవీప్రాంతంలోని శ్రీవారి నిజపాదాల వద్ద ఉగాది పర్వదిన సందర్భంగా ఉగాది పచ్చడి పంచిపెట్టారు. టీడీపీ కార్యాలయంలో కన్వీనర్ నాగేశ్వరరావు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

● కొండాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు

● **భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు**



వలేటివారిపాలెం : అంకభూపాలపురంలో బంధువులతో చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య

స్వీకరించారు. సాయిపేటలో నూతక్కి లక్ష్మీనరసయ్య జీవసమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పేదలకు అన్నదానం చేశారు. భీమవరప్పాడు లోని సీతారామచంద్ర ఆలయంలో అర్చకుడు పులిగండ్ల సురేష్‌కుమార్ శర్మ స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

● కలిగిరి : మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. స్థానిక కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు కుమారస్వామి, తిరుమలస్వామిలు పులిహోర, పండివంటలతో రూపొందించిన వేంకటేశ్వరస్వామి రూపం విశేషంగా ఆకట్టుకుంది.

● అల్లూరు : మండల ప్రజలు తమకు ఇష్టమైన దైవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. అల్లూరులోని వేణుగోపాలుడు గ్రామంలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అల్లూరులోని వేణుగోపాల స్వామి, పోలేరమ్మ, శివాలయంతోపాటు ఇస్కపల్లిలోని శివాలయం నార్తుమోపూరులోని వరదరాజస్వామి ఆలయం, రామాలయం, శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అలాగే స్థానిక గీతాశ్రమంలో శ్రీవిశ్వావసు పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సహస్రనామ స్తోత్రాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, పప్పు సుధాకర్, మోమిడి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● లింగసముద్రం : మండలంలంలోని పెదపవని, చినపవని, వీఆర్ కోట, వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెం, విశ్వనాథపురం, ఎర్రారెడ్డిపాలెం తదితర గ్రామాలలో భక్తులు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. లింగసముద్రం పంచాయతీ వాకమళ్లవారిపాలెంలోని అయ్యప్ప



ఉలవపాడు : వేణుగోపాల స్వామి ఆలయంలో పంచాంగం చదువుతున్న అర్చకుడు

ఆలయంలో భక్తులు స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేయగా, పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు.

● ఉలవపాడు : మండలంలో ఆలయాలు తెల్లవారు జాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. పసుపు, కుంకుమ, మామిడి తోరణాలతో ఇళ్ల వాకిళ్లకు శోభాయమానం సంతరించుకుంది. ఆలయాల్లో పండితులు చేసిన పంచాంగ శ్రవణం ఆలకించారు. ఉలవపాడులోని వేణుగోపాల స్వామి, నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో దేవతామూర్తులను ప్రత్యేక అలంకణలతో భక్తులు దర్శించుకున్నారు.

● ఆత్మకూరు : విశ్వావసు నామ ఉగాది వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం చేశారు. పలు ప్రాంతాల్లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, అలఘనాథస్వామి ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, శివా



ఉదయగిరి : రంగనాయకులస్వామి ఆలయంలో అలనాటి వైభవాన్ని వివరిస్తున్న వేషధారులు

లయం, తిరునాళ్లతిప్పలోని కాశీ నాయన ఆశ్రమం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● తెలుగు భారతి సేవాసమితి ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉగాది వేడుకలు నిర్వహించారు. సేవా సమితి ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి కవి గురజాడ అప్పారావు వేషధారణతో అలరించారు. నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి, తెలుగు భారతి సేవాసమితి గౌరవ సలహాదారు ఎస్వీ రమణయ్య తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే సదుద్దేశ్యంతో ఉగాది సంబరాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం తెలుగు భారతి సేవా సమితి ఉపాధ్యక్షుడు కెవి శేషారెడ్డికి శాంతి భూషణ్ బిరుదు ఇచ్చి పద్యమందారమాల జ్ఞాపికను అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి సభ్యులు చలమయ్య, నారాయణరావు, సుబ్రహ్మణ్యం, రవీంద్ర కుమార్, నారసింహారెడ్డి, రామమోహన్ రెడ్డి సుబ్బయ్య, ఓంకారం రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సంఘాలు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు, తిమ్మరుసు, తెనాలి రామకృష్ణుడి వేషధారణలతో ఉగాది పచ్చడి, గోమాతలతో పట్టణ పురవీధుల గుండా రంగనాయకులస్వామి ఆలయం వరకు మేళతాళాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రంగనాయకులస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. అలాగే మండలంలోని గండిపాళెం, కుర్రపల్లి, బిజ్జంపల్లి, అప్పసముద్రం, కొండాయపాళెం, అర్లపడియ, గుడినరవ, చెరువుపల్లి గ్రామాల్లో



అల్లూరు : గ్రామోత్సవంలో వేణుగోపాలుడు

ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● దుత్తలూరు: దుత్తలూరు, నర్రవాడ, నందిపాడు, బ్రహ్మేశ్వరం, కొత్తపేట, ఏరుకొల్లు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో పంచాగ శ్రవణం చేశారు.

● సంగం : ఉగాది సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తిరుమనకొండలోని రాజరాజేశ్వరాలయం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి విశ్వావసు నామ సంవత్సర విశిష్టతను భక్తులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి తయారుచేసి ఆంజనేయస్వామి గుడి, బస్టాండ్, రాళ్లచెలిక చౌడేశ్వరిదేవి ఆలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ ఉపాధ్యాయులు. సురేంద్రరెడ్డి, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సురేష్ తదతరులు పాల్గొన్నారు.

● సీతారామపురం: మండలంలో ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సీతారామపురంలోని గ్రామ దేవత అంకాలమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సంగం : ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న అపస్ ఉపాధ్యాయులు

● వింజమూరు : పట్టణంలోని వేద గాయత్రి ఆలయంలో ఆదివారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కవి సమ్మేళనం, పంచాంగ శ్రవణం చేసిన అనంతరం కవులు, కళాకారులు తమ కవితలను వివరించారు. ఈ కార్యక్రమంలో పులిచర్ల నాగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటనారాయణరెడ్డి, మద్దూరు గోపాల్‌రెడ్డి, కవులు, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.



సీతారామపురం : గ్రామదేవత అంకాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


వైభవంగా శ్రీనివాస కల్యాణం



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కలువాయి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కలువాయి బజారువీధి నుంచి స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకుని భక్తులు మేళ తాళాలతో ఆలయానికి చేరుకున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు.

వెంగమాంబ కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ పేరంటాలమ్మ దంపతులు

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలమ్మ, గురవయ్యానాయుడుల కల్యాణోత్సవాన్ని ఆదివారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ పట్టువస్త్రాలు సమర్పించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

అనంతసాగరం: మండలంలోని గుడిగుంట గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం వంశపారంపర్య ధర్మకర్త అల్లంపాటి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం పలు సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు సునీత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల అభివృద్ధి టీడీపీకే సాధ్యం : కాకర్ల




ఉదయగిరిలో ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీల అభివృద్ధి తెలుగుదేశం పార్టీకే సాధ్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఉదయగిరి పట్టణంలోని చిన్న మసీదులో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు, టీడీపీ నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఉపవాసపరులకు భోజనం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమవారం రంజాన్ పర్వదినాన్ని ప్రతిఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, బొజ్జా శ్రీనివాసులు, సందానీ, నల్లిపోగు నరసింహ, తుమ్మల కిరణ్, శివకృష్ణ పాల్గొన్నారు.

●సీతారామపురం : మండల కేంద్రంలోని జామియా మసీద్‌లో మండల జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొని ముస్లింలకు భోజనాన్ని వడ్డించారు. ముస్లింల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ బాబు, షేక్ పెద్ద గౌస్, షేక్ అలి, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మండల మాజీ కన్వీనర్ చెన్నకేశవులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జిల్లా ఎస్సీ కార్యనిర్వాహక ఆధికార ప్రతినిధి జామువా, జిల్లా బీసీ కార్యనిర్వహక ఆధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు, జిల్లా తెలుగు యువత నాయకుడు సింగాల నాగేశ్వరరావు, తోట మనోజ్‌బాబు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటతో ఎమ్మెల్యే ఇంటూరి భేటీ



ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ఆదివారం ఒంగోలులోని ఎంపీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల శ్రీనివాసులరెడ్డికి హార్ట్ బైపాస్ సర్జరీ జరగడంతో ఆయన ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతోపాటు పార్టీ నాయకులు ఉన్నారు.

చలివేంద్రాల ప్రారంభం

పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం, ఆర్టీసీ డిపో సెంటర్ల వద్ద స్కంధపురి సేవా సమితి, అయ్యప్ప స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, బీజేపీ నాయకులు ఘట్టమనేని హరిబాబు, కంద్రా మాల్యాద్రి, పువ్వాడి మౌనిక, అఖిల, నేహా, విగ్నేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ప్రారంభం

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు దేవరబోడుపై ఉన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామివారికి గణపతి పూజ, పంచామృతాభిషేకాలు, అర్చనాది కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంతోపాటు రెడ్లదిన్నె, పాపంపల్లి, బొటికర్లపాడు తదితర గ్రామాల ప్రజలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందనాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవాని తిరునాళ్ల



కలశపు బిందెలతో మహిళ గ్రామోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లత థియేటర్ ఎదురుగా వెలసి ఉన్న గంగా భవాని తిరునాళ్ల ఆదివారం వైభవంగా జరిగాయి. శ్రీవిశ్వావసునామ ఉగాదిని పురస్కరించుకుని ఉదయం పాతూరు శివాలయం నుంచి ఆచారపు (గొల్ల) యాదవులు పర్యవేక్షణలో 901 కలశాలతో మహిళలు జలాలను ఊరేగింపుగా తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ఆ జలాలతో జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యంలు పాల్గొని గంగమ్మ గుడి వద్ద పూజలు నిర్వహించారు. గంగమ్మ కరుణా కటాక్షాలతోనే సమాజం సుభిక్షంగా వర్ధిల్లు తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సాయంత్రం జరిగిన గ్రామోత్సవంలో అమ్మవారికి స్వాగతం పలుకుతూ బొల్లావులు, వీరతాళ్లు, నెమలి ఆటలు కీలుగుర్రాలు, భద్రకాళి రాక్షసుడి వేషా ధారణలో ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు నగళ్ల శ్రీనివాస్ కిరణ్, పీ. అలేఖ్య, నాయకులు బొంతా శ్రీనివాస్ యాదవ్, జనిగర్ల మనోహర్‌యాదవ్, గుండ్లపల్లి రమణయ్య, సన్నిబోయిన నారాయణ, భక్తబృందం పాల్గొన్నారు.

పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరపాలి



కావలి : కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కావలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ ఆదివారం సాయంత్రం కావలిలో క్రైస్తవులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డులోని ఐకాన్ సెల్ఫీ సెంటర్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి ట్రంకురోడ్డు మీదుగా శివాజీ సెంటర్ వరకు వెళ్లి తిరిగి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ క్రైస్తవులు ప్రార్థనలు చేయటంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని చర్చిల పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

●ఉలవపాడు: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి పట్ల మండలంలోని పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఉలవపాడులోని ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి ఎస్‌బీఐ బ్యాంక్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు.

తాగునీటి సమస్యపై గ్రామస్థుల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

సీతారామపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పడమటి రొంపిదొడ్ల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదివారం బిందెలతో గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత కొన్నిరోజులుగా రక్షిత మంచినీటి పథకం మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సమస్య తలెత్తిందని, కిలోమీటర్ దూరం వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు మండు తుండడంతో మూగ జీవాలు సైతం తాగునీటి కోసం అల్లాడుతున్నాయని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు అధి కారులను కోరుతున్నారు.

హిందూధర్మాన్ని ఆచరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న పోలయ్య, కంచర్ల రామయ్య, డాక్టర్ మల్లికార్జున

కందుకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని భారతీయులంతా ఆచరించాలని ఆర్ఎస్ఎస్ మూడు ప్రాంతాల ప్రముఖ్ కోలంగారి పోలయ్య పేర్కొన్నారు. హిందూ దర్మం అనేది కేవలం హిందూ మతానికి సంబంధించినది కాదని మతం ఏదైనా భారతీయులంతా హిందూధర్మాన్ని పాటించటం ద్వారా దేశాన్ని శక్తివంతంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు కందుకూరు ప్రాంతీయ ఖండ్ సంఘ్‌చాలక్ డాక్టరు తన్నీరు మల్లికార్జున మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ముఖ్య అతిథిగా పాల్గొనగా సంఘ సేవకులు, హిందూ బంధువులు పాల్గొన్నారు.

నేతల రంజాన్ శుభాకాంక్షలు

కందుకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని ముస్లింలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, తూమాటి మాధవరావు, మాజీమంత్రి మానుగుంట మహీధరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

కలువాయి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కలువాయి హిందూ ధర్మ పరి రక్షణ సమితి, సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక శివసాయి కళాశాలలో విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శేషగిరిరావు, ఎస్ఎస్ఎఫ్ సభ్యులు రాఘవరెడ్డి, వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

వింజమూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని మానసిక ప్రశాంతతను పొందవచ్చని ఒంగోలు సీనియర్ మాస్టర్ రామకృష్ణ తెలిపారు. ఆదివారం వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు.